సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 26-9-2025 15/-




## వక్ఫ్‌పై సుప్రీం కోర్టు తీర్పు






గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in
Our Bank A/c Details:
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 37 హైదరాబాద్
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 రూ.15-00
రబీ ఉస్సాని 3 1447 హిజ్రీ

**తొలిగీటు**

**నిగ్రహం, సౌశీల్యం, సంతులిత వైఖరి దైవదౌత్యంలో ఒక భాగం.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com



31

**నీటి సంక్షోభం పరిష్కారానికి ప్రవక్త (స) బోధనలు**

## లోపల...


| | |
|---|---|
| న్యూ ఇండియా ఇదేనా? ...... | 04 |
| వక్ఫ్‌పై సుప్రీం కోర్టు తీర్పు ...... | 05 |
| వక్ఫ్ చట్టంపై సుప్రీం తీర్పు– కొంత మోదం, కొంత ఖేదం ...... | 08 |
| చరితార్థులు–2 : ఆబాద్ ఖాన్ ...... | 11 |
| మహనీయ సయీద్ బిన్ జైద్ (రజి) – 1 ...... | 12 |
| సలామ్ – ఒక చిన్న మాట పెద్ద ఆత్మీయ బంధం ...... | 14 |
| ఒంటరితనం: ఆధునిక సమాజాన్ని కుదిపేస్తున్న మౌన వ్యాధి ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) ...... | 19 |
| ఆత్మహత్య అన్ని విధాల అనర్థదాయకం ...... | 20 |
| ప్రమాణం – ప్రణామం – 2 ...... | 24 |
| ఖుర్ఆన్ దార్శనికత ...... | 28 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| రోగుల పరామర్శ ...... | 34 |


**ఐక్యత సాధ్యమేనా?**



ఏర్పాటవుతున్నదట
అరబ్ నాటో కూటమి
నిజమైతే తప్పదంట
ఇజ్రాయిల్‌కు ఓటమి!
ఎంతవరకు సాధ్యమో
చూడాలోయ్ ఇక వేచి
బుద్ధి కాస్త వాడండిక
పెట్టకండి ఎవరు పేచీ!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# న్యూ ఇండియా ఇదేనా?

**కేరళలో** వారం రోజులుగా అత్యంత నీచమైన, హీనమైన సైబర్ వేధింపుల వార్త ఒకటి వస్తోంది. మలయాళ సాహిత్యంలో ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు, ఉపాధ్యాయురాలిగా పేరుప్రఖ్యాతులు పొందిన ప్రొఫెసర్ ఎం. లీలావతి గురించిన వార్త అది. ఆమె 98 సంవత్సరాల వృద్ధ వనిత. ఈ నెలలో ఆమె పుట్టిన రోజు జరిగింది. ఆమె పుట్టిన రోజు ఎలా జరుపుకుంటారని మీడియా అడిగితే ఆమె జవాబిస్తూ "గాజాలో పిల్లలు ఆకలితో అలమటిస్తుంటే నేను ఎలా తినగలను? అందుకే ఎలాంటి వేడుక లేదు" అని చెప్పారు.

ఈ వ్యాఖ్య ఒక తల్లి హృదయ వేదనగా సాధారణంగా మానవత్వం ఉన్నవారెవరైనా అర్థం చేసుకుంటారు. కానీ దేశంలోని మతతత్వ శక్తులు అలా భావించవు. ఇది పలస్తీనా పక్షపాతం, అంటే ముస్లింల పక్షపాతంగా నిర్ధారించి అత్యంత హీనంగా వ్యవహ రిస్తారు. విచిత్రమేమిటంటే స్వయంగా మోడీ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితిలో పలస్తీనాకు అనుకూలంగా ఓటు వేసినా కూడా, పలస్తీనాలో చిన్నపిల్లల హత్యాకాండలను ఎవరు విమర్శించినా ఈ మతతత్వ శక్తులు విరుచుకుపడతాయి.

"లీలావతి టీచర్" గా ప్రసిద్ధి చెందిన ఆమె ఏడు దశాబ్దాలకు పైగా ప్రముఖ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో బోధించి విద్యార్థులను తీర్చిదిద్దారు.

ఆమె స్వతంత్ర ఆలోచనా ధోరణితో ఎప్పుడూ ఏ రాజకీయ పార్టీకి కొమ్ముకాయలేదు. షా బానో కేసు, వరకట్న సమస్య, శబరిమలలో మహిళల ప్రవేశం, పర్యావరణ సమస్యలు వంటి అనేక అంశాలలో ఆమె తార్కికమైన, ప్రగతిశీలమైన అభిప్రాయా లను వ్యక్తం చేశారు. కాని, 98 ఏళ్ల ఒక తల్లి తన హృదయ వేదనను వ్యక్తం చేస్తే మతతత్వ శక్తులు ఆమెపై కిరాతక సైబర్ దాడులకు పూనుకున్నాయి. సోషల్ మీడియాలో ఆమెపై అసభ్యంగా దూషణలకు పాల్పడ్డారు.

న్యూఇండియా సోషల్ మీడియా విషపూరిత వాతావరణంలో ఇది మామూలయ్యింది. సైబర్ దాడులపై ఆమె స్పందిస్తూ "నన్ను వ్యతిరేకించేవారు స్వేచ్ఛగా వ్యతిరేకించండి. నాకు వారిపై ద్వేషం లేదు. ఏ దేశానికి చెందినవారైనా, ఏ మతం, కులం వారైనా పిల్లలు అంటే పిల్లలే. నేను తల్లి దృష్టితో వారిని చూస్తాను" అన్నారు.

మతతత్వం ఇప్పుడు ఎలాంటి వెర్రి తలలు వేస్తోందంటే, ఎన్నికల్లో గెలవడానికి మతోన్మాద విషం కక్కితే చాలన్న పరిస్థితి వచ్చింది. ఇటీవల అస్సాంలో బీజేపీ రాజకీయ ప్రచారం చూసినా ఈ విషయమే అర్థమవుతుంది.

ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకుంటూ, అస్సాం బీజేపీ ఒక వీడియోను షేర్ చేసింది. బీజేపీ లేకపోతే అస్సాం ముస్లింల ఆక్రమణలోకి వెళ్ళిపోతుందని హిందువులను భయపెట్టే వీడియో అది. ఆ వీడియో ఎలా ఉందంటే – "పాయిజాన్ కల నిజం కాకుండా చూడాలి!!" అని దానికి ఒక క్యాప్షన్ పెట్టారు. ఇక్కడ ఈ పాయిజాన్ అనబడే పాయిజన్ (విషం) అని ఎవరిని అంటు న్నారో అర్థం చేసుకోవడం కష్టమేమి కాదు. ఎందుకంటే క్రిందనే ముస్లిం వృద్ధుడి బొమ్మ కూడా వేశారు. వీడియో ఒక వృద్ధ ముస్లిం మాంసం కోస్తున్న దృశ్యం ఉంది. 'బీఫ్ లీగలైజేషన్' అనే పదాలు కనిపిస్తాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఉపనేత గౌరవ్ గొగోయి వెనుక పాకిస్తాన్ జెండాతో కనిపిస్తారు. అక్కడ 'పాకిస్తాన్ లింక్ పార్టీ' అనే పదాలు వుంటాయి. అస్సాంలోని ప్రసిద్ధ టీ తోటలు, గౌహతి విమా నాశ్రయం, గౌహతి ఆకోలాండ్ వాటర్ థీమ్ పార్క్, పురాతన రంగ్ ఘర్, గౌహతి స్టేడియం అన్నిచోట్లా ముస్లిములతో నిండి పోయి ఉన్న దృశ్యాలు వీడియోలో ఉన్నాయి. అక్రమ చొరబాటు దారులు వచ్చేస్తున్నారని, హిందువులు తమ భూములు ముస్లింలకు కోల్పోతున్నారని, బీజేపీ లేకపోతే రాష్ట్ర జనాభాలో 90 శాతం ముస్లింలే అవుతారని విద్వేషం వెదజల్లిన వీడియో ఇది. ఇలా ముస్లిములను బూచీగా చూపించి బీజేపీకే ఓటు వేయాలంటున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చే సంవ త్సరం జరగనున్నాయి.

కేంద్రంలోను, అస్సాంలోను బీజేపీయే అధికారంలో ఉంది. అయినా చొరబాటుదారులు ఎలా వస్తున్నారు? ఎంతమంది చొరబాటుదారులు వచ్చారు? ఎంతమందిని పట్టుకున్నారు? ఇలాంటి లెక్కలేవీ ఈ మతతత్వ ప్రచారంలో కనిపించవు.

ఒక వయోవృద్ధ మహిళా ప్రొఫెసర్, ప్రసిద్ధ రచయిత్రి మాతృ హృదయంతో గాజా పిల్లల హత్యాకాండ, ఆకలిదప్పులకు అల్లాడి పోతే ఈ మతతత్వ శక్తులు ఓర్వలేక అసభ్యంగా సైబర్ దాడులు చేస్తాయి.

రాజకీయాల్లో గెలవడానికి తామే అధికారంలో ఉన్నప్పటికీ చొరబాటుదారులు వచ్చేస్తున్నారంటూ భయంకర పరిస్థితిని సృష్టించి ఒక వర్గంపై విద్వేషాన్ని నూరిపోస్తారు.

రేపిస్టులకు పూలమాలలు వేసి మంత్రులే సన్మానాలు చేస్తారు.

ఇదా మనం కోరుకునే నవ భారతం?

అబ్దుల్ వాహెద్




**వక్ఫ్ (సవరణ) చట్టం,** 2025 అమలు కాకుండా నిలిపివేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కాని చట్టంలోని మూడు ప్రత్యేక నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేసింది. చట్టానికి రాజ్యాంగబద్ధత ఉన్నట్టే భావించబడుతుందని, అత్యంత అరుదైన సందర్భాల్లోనే దానిని నిలిపివేయవచ్చని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ ఏ.జి. మసీహ్‌లతో కూడిన ధర్మాసనం, వక్ఫ్ సృష్టించడానికి ఐదు సంవత్సరాలు ఇస్లాంను ఆచరించి ఉండాలి అనే నిబంధనను సంబంధిత నియమాలు రూపొందించబడే వరకు నిలిపివేసింది.

అలాగే, వక్ఫ్ ఆస్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించిందా లేదా అనేది ఒక డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేటు నిర్ణయించడాన్ని కూడా నిలిపివేసింది. పౌరుల ఆస్తి హక్కులపై ఒక నిర్వాహక అధికారి తీర్పు ఇవ్వడం అధికార విభజన సూత్రానికి వ్యతిరేకమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

అంతేకాకుండా, తాత్కాలిక ఆదేశంలో సుప్రీంకోర్టు రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముగ్గురి కన్నా ఎక్కువమంది ముస్లిమేతర సభ్యులు ఉండకూడదు అని, కేంద్ర వక్ఫ్ బోర్డులో నలుగురి కన్నా ఎక్కువమంది ముస్లిమేతర సభ్యులు ఉండకూడదు అని ఆదేశించింది.

అయితే, వక్ఫ్ ఆస్తుల తప్పనిసరి రిజిస్ట్రేషన్ నిబంధనను నిలిపివేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇలాంటి నిబంధన గత చట్టాల్లో కూడా ఉందని కోర్టు పేర్కొంది.

ఏప్రిల్ 5న రాష్ట్రపతి ఆమోదం పొందిన వెంటనే ఈ చట్టం అమలులోకి వచ్చింది. ఈ వివాదాస్పద చట్టం చెల్లుబాటుపై మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ ఎంపీ ముహమ్మద్ జావేద్ తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ సవరణ ముస్లింలపై వివక్షకు దారితీస్తుందని వారు వాదించారు.

ప్రముఖ ముస్లిం సంస్థలు జమీయత్ ఉలమా-ఎ-హింద్ (మహ్మూద్ మదనీ వర్గం), జమాఅతె ఇస్లామీ హింద్ ఒక సంయుక్త ప్రకటనలో వక్ఫ్ (సవరణ) చట్టం 2025 కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై తీవ్ర ఆందోళన వ్యక్తం

చేశాయి. ఈ తీర్పు దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులకు ప్రమాదకర మవుతుందని హెచ్చరించాయి.

మధ్యంతర ఉత్తర్వుపై జమాఅత్ అధ్యక్షుడు సయ్యద్ సాదతుల్లా హుసైనీ మాట్లాడుతూ, "వక్ఫ్ బై యూజర్" సమస్యను కోర్టు పరిష్కరించలేదని అన్నారు.

జమీయతె ఉలమా యే హింద్ అధినేత మౌలానా మహ్మూద్ మదనీ మాట్లాడుతూ, కోర్టు "వక్ఫ్ బై యూజర్"పై చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. భారతదేశంలో 4 లక్షలకు పైగా 'వక్ఫ్ బై యూజర్' ఆస్తులు ఉన్నాయి. వీటిలో సుమారు 1.2 లక్షల మసీదులు, 1.5 లక్షల సమాధులు ఉన్నాయి. వీటిలో 80 శాతం పైగా నమోదు కానివే అన్నారు.

ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించిన సంస్థ. సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పుపై పర్సనల్ లా బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ చట్టం మొత్తంగా రద్దు చేయాలని బోర్డు మరోసారి తన డిమాండ్‌ను పునరుద్ఘాటించింది.

బోర్డు ప్రతినిధి డాక్టర్ ఎస్.ఖాసిం రసూల్ ఇలియాస్ మాట్లాడుతూ "సుప్రీంకోర్టు కేవలం కొన్ని నిబంధనలను నిలిపివేయడం ద్వారా పాక్షిక ఉపశమనం ఇచ్చింది, కానీ పలు 'ఏకపక్ష' క్లాజులు అలాగే ఉంచింది. ఈ తీర్పు విస్తృతమైన రాజ్యాంగ సంబంధిత ఆందోళనలను పరిష్కరించలేదు" అని అన్నారు. "వక్ఫ్ బై యూజర్" అనే పద్ధతి రద్దు చేయడం, వక్ఫ్ డీడ్ తప్పనిసరి చేయడం వంటి పలు హానికరమైన నిబంధనలు ఇంకా అలాగే కొనసాగుతున్నాయి. అందువల్ల సవరణను పూర్తిగా రద్దు చేసి, పాత వక్ఫ్ చట్టాన్ని పునరుద్ధరించాలి" అని బోర్డు మళ్ళీ డిమాండ్ చేసింది. పర్సనల్ లా బోర్డు "సేవ్ వక్ఫ్" ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించింది.

వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టం, 2025లోని కొన్ని కీలక నిబంధనల అమలును సుప్రీంకోర్టు నిలిపివేసినా, అసలు చట్టాన్ని మాత్రం నిలిపివేయలేదు. ఈ కేసులో పిటిషనర్‌గా ఉన్న మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సుప్రీంకోర్టు తాత్కాలిక ఉత్తర్వు అసంతృప్తికరమని పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులను నాశనం చేసేందుకు ఈ ఉత్తర్వును బీజేపీ వాడుకుంటుందని విమర్శించారు.

భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి, న్యాయమూర్తి జస్టిస్ ఏ.జి. మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది.

ది వైర్ వార్తా సంస్థతో హైదరాబాద్ ఎంపీ ఓవైసీ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తి కేటాయింపుకు ముందు కనీసం ఐదు సంవత్సరాలు ఇస్లాంను ఆచరిస్తూ ఉండాలనే నిబంధనపై సుప్రీంకోర్టు ఇచ్చిన స్టే "పూర్తి స్థాయిలో నిలుపుదల కాదు" అన్నారు.

ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డుల్లో చేర్చే నిబంధనపై కోర్టు సంఖ్యను పరిమితం చేసినా, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓగా ముస్లిమేతరుని నియమించరాదనే పూర్తిస్థాయి నిబంధన లేకపోవడం ప్రమాద కరమని అన్నారు. "సాధ్యమైనంతవరకు ముస్లిం నియామకం" అనే కోర్టు వ్యాఖ్య, రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛనిస్తుందని, దీని ద్వారా ముస్లిం అధికారులు పక్కన పెట్టబడతారని పేర్కొన్నారు.

ముఖ్యంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రక్షిత స్మారక కట్టడాలు వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదనే నిబంధనను సుప్రీం కోర్టు అనుమతించడం ఆందోళన కలిగించే అంశమని, దీని ప్రభావం సంభల్ మసీదు కేసులో కనిపిస్తుందని హెచ్చరించారు.

వక్ఫ్ సవరణ చట్టంలోని మూడు నిబంధనల విషయంలో సుప్రీం కోర్టు ముస్లిం పిటిషనర్లకు ఉపశమనం కల్పించింది. కొందరు దీనిని "విజయం"గా పేర్కొంటూ సంబరాలు చేసుకుంటున్నప్పటికీ ఇది విజయమేమీ కాదని స్పష్టంగా అర్థమవుతోంది.

తమ ఆస్తిని వక్ఫ్ చేసేవారు కనీసం ఐదేళ్లుగా ఇస్లాం ఆచరిస్తున్నారని రుజువు చేయాలని చట్టంలో పేర్కొన్నారు. ఇది వాస్తవానికి మోసపూరితమైన నిబంధన, ఎందుకంటే ఒక ముస్లిం తన ఆస్తి వక్ఫ్ చేయవచ్చా లేదా అనే మౌలిక హక్కును ఇది సవాలు చేస్తుంది. ఎవరు ఏ మతాన్ని ఆచరిస్తున్నారు అన్నది ప్రభుత్వం నిర్ధారించే పద్ధతీ ఏదీ లేదు. ఒక వ్యక్తి తాను ఫలానా మతస్తుడినని ప్రకటించిన తర్వాత అతని మతం అదే అవుతుంది.

ఈ మధ్యంతర ఉత్తర్వు వివరాలను జాగ్రత్తగా చదివితే నిరాశ కలుగుతుంది. రాజ్యాంగ విరుద్ధమైన నాలుగు నిబంధనలను కోర్టు రద్దు చేయలేదు, వాటిని ప్రశ్నించనూ లేదు.

మొదటిది: వక్ఫ్ సంస్థల్లో ముస్లిమేతర సభ్యుల నియామకం వివక్షాత్మకమైనదని వేరే చెప్పనవసరం లేదు. ఈ విషయంలో కోర్టు ఖచ్చితంగా వ్యవహరించలేదు. వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చాలని మోడీ ప్రభుత్వం చేసిన చట్టం రాజ్యాంగబద్ధమేనని కోర్టు భావించింది.

ఇలాంటి నిబంధన గతంలో వక్ఫ్ చట్టంలో లేదు. ఇతర మతాల సంస్థల చట్టాల్లోనూ ఇలాంటి నిబంధన లేదు. ఇప్పటికీ తిరుపతి,

కాశీ విశ్వనాథ్ వంటి హిందూ మత సంస్థల్లో హిందువులు కానివారు సభ్యులుగా ఉండరాదని చట్టం నిషేధిస్తుంది. క్రైస్తవ, సిక్కు సంస్థల్లోనూ వారి మతానికే చెందిన సభ్యులు మాత్రమే ఉంటారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 ప్రకారం ప్రతి మత సమాజం తన మత సంస్థలను తానే నిర్వహించుకోవచ్చని స్పష్టంగా హామీ ఉంది. కానీ ముస్లిం వక్ఫ్ సంస్థల్లో మాత్రం ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చాలని మోడీ ప్రభుత్వం చట్టం తీసుకువచ్చింది. వక్ఫ్ ఆస్తులను దోచుకునే కుట్ర మాత్రమే ఇది. సుప్రీంకోర్టు ఈ నిబంధనను పూర్తిగా రద్దు చేయకుండా కేవలం పరిమితి మాత్రమే విధించింది.

వక్ఫ్ చట్టం 2025 సవరణ ప్రకారం, 22 మంది కౌన్సిల్ సభ్యుల్లో కేవలం 10 మంది మాత్రమే ముస్లింలు ఉండాలి. మిగతా సభ్యులను ప్రభుత్వం ముస్లిమేతరులైనా సరే నియమించు కోవచ్చు. అంటే, ముస్లింలు తమ సొంత వక్ఫ్ కౌన్సిల్‌లోనే మైనారిటీ అవుతారు. రాష్ట్ర బోర్డుల్లోనూ ఇదే పరిస్థితి.

ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన ఉపశమనం ఏంటంటే, 20 మంది సభ్యులతో కూడిన కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో 4 గురికి మించి ముస్లిమేతర సభ్యులు ఉండరాదని పేర్కొంది. రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లోని 7 మంది సభ్యుల్లో ముగ్గురికి మించి ముస్లిమేతరులు ఉండరాదని పేర్కొంది. ఇలాంటి నిబంధన ఏదన్నా ఇతర మతాల సంస్థల విషయంలో ఉందా? లేకపోతే ఇది వివక్ష కాదా?

వక్ఫ్ కౌన్సిల్ సీఈఓ ముస్లిమేతరుడు ఉండవచ్చనే నిబంధనను సుప్రీంకోర్టు రద్దు చేయలేదు. సి.యీ.ఓ. "ముస్లిం అయితే మంచిది" అని సలహా మాత్రమే ఇచ్చింది. ప్రభుత్వాలు ఇలాంటి సలహాలను లెక్కచేస్తాయా? నిజం చెప్పాలంటే మతతత్వ రాజకీయాలకు ఇది మరింత ప్రోత్సాహమిస్తోంది.

రెండవది: ఆస్తిని వక్ఫ్ చేసే ముస్లిం గురించినది. వక్ఫ్ చేయాలనుకుంటున్న ముస్లిం తాను పూర్తి స్థాయి ముస్లింగా నిరూపించుకోవాలనే నిబంధనకు కోర్టు తీర్పు పరోక్షంగా సమర్థనే ఇచ్చింది. వక్ఫ్ సవరణ చట్టంలో మరో సమస్య ఏమిటంటే, తన ఆస్తిని కేవలం ముస్లిం మాత్రమే వక్ఫ్ చేయ గలదు. పైగా ముస్లింగా 5 సంవత్సరాల పాటు ఇస్లామ్ మతాన్ని ఆచరిస్తున్నవాడిగా నిరూపించుకున్న తర్వాత మాత్రమే చేయగలడు. ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా? భారతదేశంలో పౌరులు తమ ఆస్తిని మతపరమైన లేదా సేవాపరమైన కార్యక్రమాల కోసం దానం చేసే హక్కు లేదా? కేవలం ముస్లిములు మాత్రమే, అందులోను ఐదేళ్ళుగా ప్రాక్టీసింగ్ ముస్లిముగా నిరూపించుకున్నవారు మాత్రమే వక్ఫ్ చేయగలరనే నిబంధన అధికరణ 15 (మత ఆధారిత వివక్ష నిషేధం)ను ఉల్లంఘించడం లేదా?. అధికరణ 300 ప్రకారం ప్రతి పౌరుడికి తన ఆస్తిని తన ఇష్టానుసారం వినియోగించే హక్కు ఉంది. ముస్లింకాని వారు వక్ఫ్ చేయలేరని చెప్పడం మౌలిక హక్కులపై దాడి కాదా?

కానీ సుప్రీంకోర్టు ఈ నిబంధనను రాజ్యాంగ విరుద్ధమని రద్దు చేయకుండా, "ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు నియమాలు రూపొందించే వరకు నిలిపివేస్తున్నాం" అని మాత్రమే చెప్పింది. అంటే, ప్రభుత్వ జోక్యానికి తలుపులు తెరిచే ఉంచింది.

మూడవది: వక్ఫ్ నమోదు కోసం కఠినమైన నిబంధనలు వక్ఫ్ సవరణ చట్టంలో తీసుకొచ్చారు. వక్ఫ్ రిజిస్ట్రేషన్‌కు అనేక అడ్డంకులు విధించారు. దాత పేరు, తేదీ తప్పనిసరి చేశారు. శతాబ్దాలనాటి వక్ఫ్ ఆస్తులకు ఇలాంటి రికార్డులు ఉండవని న్యాయవాదులు గుర్తు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోలేదు. చివరి తీర్పులో పరిశీలిస్తామని మాత్రమే చెప్పింది.

నాల్గవది: ఈ తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా లేదా? మొత్తం చట్టాన్ని నిలిపివేయాలనే వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. "అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే మొత్తం చట్టాన్ని నిలిపివేస్తాం" అని పేర్కొంది. సాధారణ సందర్భాల్లో ఈ వాదన సమంజసమే. కాని ఒక వర్గం పట్ల పూర్తి వివక్షతో వ్యవహరిస్తున్న సందర్భాల్లో ఈ వాదన సమంజసమా?

ఐదవది: కోర్టు ఒక విషయంలో ఉపశమనం కలిగించింది. వక్ఫ్ సంస్థలు, ప్రభుత్వాల మధ్య తలెత్తే వివాదాలను ప్రభుత్వ అధికారులు పరిష్కరించలేరని తీర్పు ఇచ్చింది. ఇది అధికార విభజన సూత్రానికి విరుద్ధమని స్పష్టం చేసింది. ఇలాంటి వివాదాలను కేవలం ట్రిబ్యునల్స్ లేదా హైకోర్టులు మాత్రమే పరిష్కరించాలి. అంతవరకు వక్ఫ్ హోదా కొనసాగుతుందని చెప్పిన మాట స్వాగతించదగిన, అభినందించదగిన విషయం.

వక్ఫ్ (సవరణ) చట్టం, 2025పై సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక తీర్పు ఒక చిన్న ఊరట మినహా మరేమీ కాదు. ఇది కేవలం తాత్కాలిక తీర్పు మాత్రమే. తుది తీర్పు కోసం, న్యాయాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే లక్ష్యంగా పోరాటం ఇంకా కొనసాగవలసి ఉంది. ✤




# వక్ఫ్ చట్టంపై సుప్రీం తీర్పు- కొంత మోదం, కొంత ఖేదం

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

భారతదేశం మతపరమైన, సాంస్కృతిక, సామాజిక వైవిధ్యానికి ప్రతీక. ఇక్కడ మైనారిటీ హక్కుల పరిరక్షణ రాజ్యాంగపరమైన హామీ. కానీ తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక తీర్పు ముస్లిం సమాజం ఆశలకు భిన్నంగా వచ్చింది. మూడు ప్రొవిజన్లపై విధించిన తాత్కాలిక స్టే కొంత ఊరటనిచ్చినా, మొత్తంగా చూస్తే తీవ్రమైన నిరాశనే మిగిల్చింది. నిజానికి 'వక్ఫ్' అనేది భూములు లేదా భవనాల సమస్య కాదు, అది ముస్లింల ధార్మిక కర్తవ్యం, విశ్వాసానికి సంబంధించిన ఆధ్యాత్మిక అంశం. భారతదేశంలో వక్ఫ్ ఆస్తులు మసీదులు, దర్గాలు, ఖబరస్తాన్లు, మదరసాలు, అనాథాశ్రమాలు, దాతృత్వ సంస్థల రూపంలో ముస్లిం సమాజ ధార్మిక, సామాజిక అవసరాలను నెరవేర్చుతూ వచ్చాయి. బ్రిటిష్ కాలం నుంచే వక్ఫ్ వ్యవస్థకు చట్టపరమైన రక్షణ లభించింది. స్వాతంత్ర్యం అనంతరం 1954లో తొలి వక్ఫ్ చట్టం, తరువాత 1995లో రూపుదిద్దుకున్న వక్ఫ్ చట్టం ద్వారా ఈ ఆస్తుల పరిరక్షణకు మరింత బలమైన చట్టబద్ధత ఏర్పడింది. అయితే తాజాగా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం 2025 అనూహ్యమైన వివాదాలకు దారితీసింది. ఈ చట్టంలో వక్ఫ్ ఆస్తుల నిర్వచనాన్ని మార్చడం, ముస్లిం సమాజానికి ఉన్న ప్రత్యేక హక్కులను తగ్గించడం, అలాగే వాటిని సాధారణ భూసర్వే పరిధిలోకి తేవడం వంటి నిబంధనలు ఉన్నాయి. ఈ కారణంగా దేశవ్యాప్తంగా ముస్లింలలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. మరొక కీలక సమస్య ఏమిటంటే, ఈ చట్టం ఒక కీలకమైన అంశాన్ని పూర్తిగా విస్మరించింది. శతాబ్దాలుగా ఒక ఆస్తి వక్ఫ్ అవసరాల కోసం నిరంతరం ఉపయోగించబడితే, అది స్వయంగా వక్ఫ్ ఆస్తిగా పరిగణించ బడాలి అనే ఇస్లామిక్ సూత్రాన్ని కొత్త చట్టం గుర్తించలేదు. అంటే, వాడుక ఆధారంగా వక్ఫ్‌గా ఏర్పడే హక్కును ఇప్పుడు తొలగించింది. ఇది వక్ఫ్ ఆస్తుల ప్రాథమిక స్వభావాన్నే దెబ్బతీసే

మార్పు అని ముస్లిం సమాజం భావిస్తోంది.

ప్రభుత్వ వాదన ఏమిటంటే వక్ఫ్ ఆస్తులు తరచుగా దుర్వినియోగానికి గురవుతున్నాయి, అవి పారదర్శకంగా నిర్వహించబడటం లేదు. అందుకే నూతన చట్టం ద్వారా రికార్డుల సమగ్రతను తీసుకురావడం అవసరమని కేంద్రం చెబుతోంది. కానీ ఈ వాదన వెనుక వేరే ఉద్దేశ్యం దాగి ఉందని ప్రతిపక్షాలు, ముస్లిం ధార్మిక సంస్థలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. అదే వక్ఫ్ ఆస్తులను తేలికగా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకుని, వాటిని తమ ప్రయోజనాలకు అనుకూలంగా మలచుకోవడం. ఈ అనుమానాలకు బలం చేకూర్చేలా కొన్ని నిబంధనలు రూపొందించబడ్డాయి. ముఖ్యంగా, వక్ఫ్ ఆస్తి అని గుర్తించబడటానికి ఇకపై కేవలం ముస్లింల వాంగ్మూలం లేదా చారిత్రక ఆధారాలు సరిపోవు, భూ సర్వే, రెవెన్యూ రికార్డులు తప్పనిసరి అన్న నిబంధన తీవ్ర వివాదాస్పదమైంది.

మరో సమస్య, ప్రతి వక్ఫ్‌కి తప్పనిసరిగా లిఖిత పూర్వక డీడ్ ఉండాలి అనే నిబంధన. వాస్తవానికి అనేక వక్ఫ్‌లు సంప్రదాయంగా మౌఖికంగా లేదా సమాజ అంగీకారంతో ఏర్పడ్డాయి. వాటిని అకస్మాత్తుగా చెల్లనివిగా మార్చడం అంటే ముస్లిం సమాజం శతాబ్దాల ఆస్తులను నిర్వీర్యం చేయడమే అవుతుంది.

అదే సమయంలో, వక్ఫ్ బోర్డుల స్వతంత్రతను కుదించేలా, వాటి అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోకి తేవడం, వక్ఫ్ ట్రిబ్యునల్ అధికారాలను తగ్గించడం వంటి ప్రతిపాదనలు కూడా చట్టంలో చోటు చేసుకున్నాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా ముస్లిం సమాజంలో అసంతృప్తి, నిరసనలు చెలరేగాయి. వివిధ వక్ఫ్ బోర్డులు, ముస్లిం మతపెద్దలు, పౌరసంఘాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

ఈ పిటిషన్లను పరిశీలించిన సుప్రీంకోర్టు సెప్టెంబర్ 15, 2025న కీలక తీర్పు వెలువరించింది. వక్ఫ్ సవరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయకపోయినా, కొన్ని విభాగాల రక్షణ అవసరాన్ని కోర్టు ప్రస్తావించింది.

సుప్రీంకోర్టు మరో ముఖ్యమైన అంశంపై స్పష్టతనిచ్చింది. మతపరమైన పరిపాలనలో బాహ్య జోక్యం ఉండకూడదని. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో 22 మంది సభ్యులలో నలుగురికంటే ఎక్కువమంది ముస్లిమేతరులు ఉండరాదని, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో 11 మంది సభ్యులలో ముగ్గురికంటే ఎక్కువమంది ముస్లిమేతరులు ఉండరాదని కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాన్ని వక్ఫ్ పరిపాలనలో ముస్లిం సమాజానికి కనీస నియంత్రణ కల్పించే రక్షణాత్మక చర్యగా పరిగణించవచ్చు.

**రాజకీయంగా చూస్తే, రాబోయే ఎన్నికల దృష్ట్యా బీజేపీ ప్రభుత్వం మెజార్టీ వర్గాల మద్దతు కోసం మైనారిటీల ఆస్తులపై నియంత్రణ సాధించాలనే ప్రయత్నం చేస్తోందని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. వక్ఫ్ ఆస్తుల విలువ దేశవ్యాప్తంగా లక్షల కోట్ల రూపాయలకు చేరుకుందని అంచనా. ఇలాంటి ఆస్తులపై నియంత్రణ సాధించడం ద్వారా మైనారిటీలకు దఖలు పడిన హక్కును కొల్లగొట్టి, ప్రభుత్వం ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు పొందే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.**

అలాగే, వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన ఏకపక్ష అధికారాలను కోర్టు తిరస్కరించింది. ఒక ఆస్తి ప్రభుత్వానికి చెందిందా లేక వక్ఫ్ ఆస్తా అన్నది జిల్లా కలెక్టర్‌కు నిర్ణయించే అధికారం ఉండదని కోర్టు చెప్పింది. పౌరుల వ్యక్తిగత హక్కుల విషయంలో జిల్లా మేజిస్ట్రేట్ తీర్పులు ఇవ్వలేరని కూడా స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఒక వ్యక్తి కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాం మతాన్ని ఆచరిస్తేనే తన ఆస్తిని వక్ఫ్ చేయగలడు, అనే నిబంధన రాజ్యాంగ విరుద్ధమని, మత స్వేచ్ఛకు వ్యతిరేకమని కోర్టు తేల్చి నిలిపివేసింది. వక్ఫ్ అనేది మతపరమైన దానం, దానికోసం కాలపరిమితి విధించడం పూర్తిగా అసంబద్ధం. ఈ అంశాలన్నింటిపై ప్రభుత్వం కొత్త నియమాలు నిర్ణయించే వరకు స్టే అమలులో ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. వక్ఫ్ బోర్డు సీ ఈ ఓ గా ముస్లిం వ్యక్తిని నియమించాలని సూచన చేసింది. దీనిపై ఎలాంటి ఆదేశమూ ఇవ్వలేదు.

సుప్రీంకోర్టు అభిప్రాయం ప్రకారం, వక్ఫ్ చట్టం 2025లోని కొన్ని నిబంధనలు ప్రాథమిక హక్కులకు, మత స్వేచ్ఛకు విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా, వక్ఫ్ ఆస్తుల నిర్వచనాన్ని పరిమితం చేసే నిబంధన, వక్ఫ్ బోర్డుల అధికారాలను తగ్గించే నిబంధన, వక్ఫ్ ట్రిబ్యునల్ నిర్ణయాలను ప్రభుత్వ పరిశీలనకు లోను చేసే నిబంధనలపై కోర్టు స్టే విధించింది. అలాగే భూసర్వే అధికారులకు తుది అధికారం ఇవ్వడం తాత్కాలికంగా అమలులోకి రాకూడదని ఆదేశించింది.

ఈ తీర్పు తాత్కాలిక ఉపశమనం మాత్రమే అయినా, దీని ప్రభావం విశాలం. వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వానికి పూర్తి అధికారం లభించలేదన్న స్పష్టత సమాజంలో ఒక చిన్న ఊరట కలిగించింది. దాంతో ముస్లింల చారిత్రక హక్కు ఇంకా కాపాడబడుతున్నట్టే అన్న భావన బలపడింది. అంతేకాకుండా, మత స్వేచ్ఛ, మైనారిటీల హక్కులపై మళ్లీ జాతీయ స్థాయిలో వాదోపవాదాలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు కూడా స్పష్టంగా పేర్కొన్నది ఏమిటంటే, వక్ఫ్ ఆస్తులు కేవలం భౌతిక ఆస్తులు కాదు, అవి ధార్మిక విశ్వాసాల, సామాజిక నిర్మాణాల ప్రతీకలు. వాటి పరిరక్షణ రాజ్యాంగబద్ధ హక్కులకు సంబంధించిన అంశమే.

మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిన విధానం కూడా విమర్శలకు గురవుతోంది. విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపకుండా, ముస్లిం మతపెద్దల అభిప్రాయాలు పట్టించుకోకుండా, ఒక్కసారిగా పార్లమెంట్‌లో ఆమోదించడం ప్రజాస్వామ్య ప్రమాణాలకు విరుద్ధమని అంటున్నారు. ముఖ్యంగా ఈ చట్టం వెనుక ఉద్దేశ్యం మైనారిటీల హక్కులను బలహీనపరచడమే అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రాజకీయంగా చూస్తే, రాబోయే ఎన్నికల దృష్ట్యా బీజేపీ ప్రభుత్వం మెజార్టీ వర్గాల మద్దతు కోసం మైనారిటీల ఆస్తులపై నియంత్రణ సాధించాలనే ప్రయత్నం చేస్తోందని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. వక్ఫ్ ఆస్తుల విలువ దేశవ్యాప్తంగా లక్షల కోట్ల రూపాయలకు చేరుకుందని అంచనా. ఇలాంటి ఆస్తులపై నియంత్రణ సాధించడం ద్వారా మైనారిటీలకు దఖలు పడిన హక్కును కొల్లగొట్టి, ప్రభుత్వం ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు పొందే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.

సుప్రీంకోర్టు తీర్పు ఈ దిశలో ఒక తాత్కాలిక అడ్డుగోడలా నిలిచింది. కానీ ఇది తుది తీర్పు కాదు. కేసు మరింత విస్తృతంగా విచారణకు వస్తుంది. అయినప్పటికీ, ముస్లిం సమాజానికి ఇది ఓ ముఖ్యమైన న్యాయపరమైన విజయమే అని చెప్పాలి. ఎందుకంటే, వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వం ఏకపక్షంగా అధికారం చెలాయించలేదని కోర్టు స్పష్టంగా చెప్పింది.

ఈ తీర్పు గుర్తు చేస్తున్నది ఏమిటంటే, రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను కల్పిస్తుంది, మైనారిటీల హక్కులను రక్షించడం ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. ముస్లిం సమాజం వక్ఫ్ ఆస్తులను పారదర్శకంగా నిర్వహించు కోవడం, అవినీతి, దుర్వినియోగం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం కూడా అత్యవసరం. ఎందుకంటే కొన్ని చోట్ల వక్ఫ్ ఆస్తులు ఆక్రమించబడటం, నిర్వాహకులు అవినీతిలో కూరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. వీటిని సరిదిద్దక పోతే వక్ఫ్ వ్యవస్థపై నమ్మకం సడలిపోతుంది.

మొత్తానికి, సెప్టెంబర్ 15న వెలువడిన సుప్రీంకోర్టు తాత్కాలిక తీర్పు, వక్ఫ్ చట్టం 2025 చుట్టూ ఉన్న వివాదాలకు కాస్త తెర దింపే ప్రయత్నం చేసింది. ఇది ముస్లిం సమాజానికి పెద్దగా ఊరటను ఇవ్వలేదు. కేవలం మూడు ప్రొవిజన్లపై స్టే ఇవ్వడం తప్ప, మిగతా కీలక నిబంధనలను కొనసాగించడమే ముస్లిం సమాజంలో నిరాశ కలిగించింది. వక్ఫ్ ఆస్తులు కేవలం భూములు, భవనాలు కాదని, అవి శతాబ్దాలుగా ముస్లింల మతపరమైన, సామాజిక జీవితానికి ఆధారం అని కోర్టు స్పష్టంగా గుర్తించకపోవడం బాధాకరం. ఏది ఏమైనా, ఈ తీర్పు అసలు సమస్యను పరిష్కరించలేదు, కేవలం ఇరు వర్గాలను సంతృప్తపరిచే ప్రయత్నం మాత్రమే చేసింది.

సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే సుప్రీంకోర్టు తుది తీర్పు కోసం ఎదురుచూడక తప్పదు. ఆ తీర్పే వక్ఫ్ ఆస్తుల భవిష్యత్ దిశను నిర్ణయిస్తుంది. ✤


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.



# ఆబాద్ ఖాన్

## (1897 -1975)

**95**




బ్రిటిష్ ప్రభుత్వం కళ్ళుగప్పి కలకత్తా నుండి తప్పించుకుని ఒక పఠాన్ వేషంలో పెషావర్ నుండి కాబూల్‌కు వెళ్ళ సంకల్పించిన స్వాతంత్ర్య సంగ్రామ యోధులు, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు పఠాన్ ప్రజల ఆచార సంప్రదాయాలు, ఆహారం, ఆహార్యం. అలవాట్లను ఆచరణాత్మకంగా అవగాహన కల్పించిన ఆబాద్ ఖాన్ 1897లో ప్రస్తుత పాకిస్థాన్‌లోని నౌషేరా జిల్లాలోని పీర్‌పాయ్ గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి ఈసా ఖాన్, తల్లి హవాస్ నూరా. చిన్నతనంలో గురువు నుండి బ్రిటిషర్ల దోపిడి విధానాన్ని తెలుసుకున్న ఆబాద్ ఖాన్, విద్యార్థి దశ నుండే ఆంగ్లేయ ప్రభుత్వం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చారు. చదువు తరువాత పలు ప్రాంతాలలో చిన్నా చితక ఉద్యోగాలు చేసిన ఆయన చివరకు బ్రిటిష్ భారత సైన్యంలోని రవాణా వ్యవస్థలో చేరారు. ఆ సందర్భంగా అనుచితంగా వ్యవహరించిన ఆంగ్ల అధికారి మీద తిరగబడి నిర్బంధానికి గురయ్యారు. సహోద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మరో ఆంగ్లేయుడికి వ్యతిరేకంగా సహచరుల చేత సమ్మె చేయించి 1921లో ఉద్యోగం పోగొట్టుకున్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్న వ్యవస్థలకు, సంస్థలకు ఆయన అన్ని విధాల మద్దతిచ్చారు. ఆది నుండి విప్లవోద్యమాలపట్ల ఆసక్తి చూపిన ఆబాద్‌ఖాన్ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరి, మిత్రులు మియాం అక్బర్ షాహ్‌తో కలిసి ప్రధాన భూమిక నిర్వహిం చారు. కలకత్తా నుండి తప్పించుకున్న సుభాష్ చంద్రబోస్ 1940 డిసెంబర్ 19న పెషావర్ చేరుకున్నారు. ఆఫ్రిది తెగకు చెందిన పఠాన్‌ల నివాస ప్రాంతాల గుండా ఆయన కాబూల్ ప్రయాణం సాగాల్సి ఉన్నందున ఆయన రూపు రేఖలు, నడత, నడకలో మార్పులు తెచ్చేందుకు ఏడు రోజుల పాటు తన ఇంట ఆయనకు ఆతిథ్యం, ఆశ్రయం కల్పించి ఆబాద్ ఖాన్ రహస్యంగా శిక్షణ గరిపారు. పఠాన్‌ల ఆచార సంప్రదాయాలు, మాటామంతి, మంచి నీరు త్రాగటం, తిండి తినడం, నడక, నడత, మస్జిద్‌లకు వెళ్ళడం, నమాజ్ చేయడం, దర్గాలను సందర్శించడం, సంబోధన-ప్రతిసంబోధనలు తదితర విషయాలను ఆయన సుభాష్ చంద్రబోస్‌కు ఎరుకపర్చారు. ఆ కారణంగా ఆగ్రహించిన ఆంగ్ల ప్రభుత్వం 1941 అక్టోబర్‌లో నిర్బంధించి, పలు జైళ్ళకు తరలిస్తూ ఆయనను ఇక్కట్ల పాల్జేసింది. ఆ తరువాత ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత మాత్రమే ఆబాద్ ఖాన్‌ను ఆంగ్ల ప్రభుత్వం విడుదల చేసింది. ఆంగ్లేయుల నుండి స్వాతంత్ర్యం లభించాక కూడా స్వజనుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధం కలిగినప్పుడల్లా ఆగ్రహిస్తూ, సామ్యవాద భావజాలంతో పాకిస్థాన్ రాజకీయ రంగాన కొనసాగిన ఆబాద్ ఖాన్ పలుమార్లు నిర్బంధాలకు గురయ్యారు. అనునిత్యం ప్రజల పక్షం వహించి చివరివరకు పోరుబాటన సాగి ఆటుపోట్లను ఎదుర్కొన్న పోరాట యోధులు ఆబాద్ ఖాన్ 1975 జనవరి 23న కన్నుమూశారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



9/1

# సత్య పిపాసకు మారుపేరు

**ఎస్.ఎమ్. మలిక్**

## మహనీయ సయీద్ బిన్ జైద్ (రజి)

### ఆయన తండ్రి

పది తరాల పూర్వం 'అదీ' అనే విజ్ఞతా ధురంధరుడు, అందరికీ ప్రియమైన వాడు, సంతాన కుబేరుడు, నాయకత్వం, రాజకీయాల్లో పేరుగన్న వాడు రూపొందించిన తెగ 'అదీ'లో పుట్టిన సయీద్, ఆయన తల్లి దండ్రులు సహజంగానే విగ్రహారాధనను నిరసించేవారు. వారు తాము మహనీయ ఇబ్రాహీమ్ (అ) ధర్మాన్ని పాటిస్తున్నామని అనుకునేవారు. మహనీయ సయీద్ బిన్ జైద్ తండ్రి జైద్, అన్ని విధాల పాపాలకు దూరంగా, విగ్రహాలకు అర్పించిన బలిదానాలకు నైవేద్యాలకు దూరంగా మెలిగేవారు.

ఆయన ఒక పండుగ పూట, ఖురైషీలు సామాన్యంగా విగ్రహారాధన చేస్తూ విగ్రహాలకు బలిదానాలు అర్పించుకుంటూ ఉండగా వారిని సంబోధిస్తూ ఇలా ప్రసంగించారు:

"ఖురైష్ జనులారా! మేకను పుట్టించిన వాడు అల్లాహ్, అది త్రాగేందుకు, ఆకాశం నుండి నీరు కురిపించిన వాడు అల్లాహ్, అది మేసేందుకు భూమి మీద గడ్డి మొలపించిన వాడు కూడా అల్లాహ్‌యే. మరి మీరేమో దాన్ని దైవేతరుల పేరిట బలి చేయడానికి ఈడ్చుకు పోతున్నారు. మీరు చేసే ఈ పని ఎంత అజ్ఞానమయినది, ఎంత మూర్ఖమయినది?"

ఇది విని ఆయన బాబాయి, మహనీయ ఉమర్ ఫారూక్ తండ్రి ఖత్తాబ్, ఆగ్రహావేశంతో ఆయనకు ఓ లెంపకాయ వేశాడు, "నీ పాడు గాను, నీ ఈ ప్రేలాపనలు మేము వింటూ, దాన్ని భరిస్తూ మా సహనం చచ్చిపోయింది" అని పలికి తమ తెగలోని గూండా మూకను ఆయనకు వ్యతిరేకంగా పురికొలిపాడు. వారు ఆయన్ని బాగా బాధ పెట్టారు, కడకు ఆయన మక్కా వదలి వెళ్ళిపోయారు. అప్పుడప్పుడు ఆయన గప్‌చుప్‌గా దాక్కుంటూ మక్కాలో ప్రవేశించేవారు.

### సత్యాన్వేషకులు

ఇటువంటి భావాలు గలవారు మక్కాలో నలుగురు పురుషులు ఉండేవారు. వరకా బిన్ నౌఫల్, అబ్దుల్లా బిన్ జహ్ష్, ఉస్మాన్ బిన్ హారిస్, జైద్ బిన్ అమ్ర్. వీరు నలుగురు సత్యాన్వేషణలో చాలా తిరిగి అలసి పోయారు. వీరిలో వరకా బిన్ నౌఫల్ క్రైస్తవం స్వీకరించారు. అబ్దుల్లా, ఉస్మాన్ ఏ నిర్ణయం తీసుకోలేక పోయారు. ఇక జైద్ సత్యాన్వేషణ గాథ అపురూపమయినది.

యూదు మతం, క్రైస్తవం పట్ల ఎంత యోచించినా ఆయనకు తృప్తి కలగ లేదు. ఇబ్రాహీమ్ ధర్మాన్ని ఎంత వెదికినా దొరకలేదు. ఆయన సత్యాన్వేషణలో ఉత్తరాన సిరియా చేరి ఓ యూదు

రిబ్బీని ఆశ్రయించారు. అతను జైద్ నివసించే ప్రాంతంలోనే పారక్లీటస్ (PARACLITUS) రానున్నారని ఆయన ఇబ్రాహీమ్ ధర్మాన్నే బోధిస్తారని పలికాడు. జైద్ దేవుని ఏకత్వాన్ని నమ్మి ఆ ఫార్ఖాలీత్ (పారక్లీటస్) కొరకు ఎదురు చూస్తూ వెనక్కి మరలారు.

## ఆయనే ఒక సముదాయం

కాని జైద్ ఆ ఫార్ఖాలీత్ (మహనీయ ముహమ్మద్) ప్రభవనకు పూర్వమే తన తిరుగు ప్రయాణంలో ఓ దొంగల ముఠా చేతిలో మరణించారు. ఆయన తుదిశ్వాస వదలుతూ ఆకాశం వైపునకు చూస్తూ, "దైవమా! నీవు ఆ శుభానికి నన్ను దూరం చేశావు, కాని నా పుత్రుడు సయీద్‌ను ఆ శుభానికి దూరం చేయకు" అని ప్రార్థించారు. దైవం ఆయన మొరను ఆలకించి, ఆమోదించాడు. ఇస్లామ్ వెలుగు విరజిమ్ముతూ ఉన్నప్పుడు ప్రవక్తశ్రీ(స)ని ప్రప్రథమంగా ధ్రువీకరించిన వారిలో జైద్ కుమారుడు సయీద్ కూడా ఉన్నారు. అందువల్లనే కాబోలు ప్రవక్త మహనీయులు(స) జైద్‌ని గురించి ఇలా ప్రవచించారు:

లెక్కల దినాన జైద్ ఒంటరిగా వేరొక సముదాయంగా లేపబడతారు. అంటే ఆయన ఒక్కడే సన్మార్గం పొందిన వర్గానికి సమానంగా ఉంటారన్న మాట

## ఇస్లామ్ స్వీకృతి

క్రీ.శ. 610 ఆగస్టులో మక్కా లోయ ఇస్లామ్ కాంతితో తేజోమయమయినప్పుడు అక్కడ జైద్ లేకపోగా ఆయన తనయుడు సయీద్ (శుభంకరుడు) నామధేయుడు మక్కాలోనే ఉండేవారు. ఆయన ఆ కాంతి ద్వారా జ్యోతిర్మయం అయ్యారు. అప్పుడు మహనీయ సయీద్ వయసు ఇరువై సంవత్సరాలు. ఆయన సత్య ప్రియుడయిన తండ్రి సుతుడు, దేవుని ఏకత్వంలోని సత్యత పట్ల సుముఖత, బహుదైవ భావన పట్ల ఏవగింపు మెండుగా ఉన్న దైవజ్ఞుడు, ఇస్లామ్ మౌలిక విశ్వాసంతో చిర పరిచయం గల వ్యక్తి కావటాన ప్రారంభంలోనే నిజ ధర్మాన్ని ఓ సత్య పిపాసి వలె ముందుకు వచ్చి ఇస్లామ్ అమృత ధారను గ్రోల గలిగారు!

ఆయన ఒక్కరే కాదు, ఆయన సతీమణి, మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్ సోదరి, ఫాతిమా కూడా ఆ జ్యోతిని ఆహ్వానించారు. ఆ తరువాత ఆయన తన యవ్వనమే కాదు, యావజ్జీవితం సత్య ధర్మవ్యాప్తికి వెచ్చించారు. మహనీయ ఉమర్ సత్య ధర్మ స్వీకారానికి కారకులయ్యారు. ఒక్క బద్ర్ తప్ప సమస్త పోరాటాల్లో ప్రవక్త మహనీయులకు తోడుగా పాల్గొన్నారు. బద్ర్ లోనూ ప్రవక్తశ్రీ(స) అప్పజెప్పిన మరో బాధ్యత నిర్వహణ వల్ల పాల్గొనలేకపోయారు.

మక్కా ముష్రిక్ ముష్కరుల విపత్తుల నుంచి తప్పించుకునేందుకు తమ ఇస్లామ్‌ను రహస్యంగా ఉంచే అనుమతి ముస్లిములకు ఉండేది. అందువల్ల ఆ రహస్యం తొలుత బయట పడలేదు. కాని మహనీయ ఉమర్ ప్రవక్తశ్రీ(స)ని సంహరించేందుకు బయలు దేరినప్పుడు దారిలో ఓ వ్యక్తి తారసపడి, "ముందు నీ సోదరి, బావను విచారించు" అని ఎత్తి పొడవగా మహనీయ ఉమర్ కు ఆగ్రహం కలిగింది. ఆ ఆగ్రహంలోనే దారి మళ్ళించారు ఉమర్.

## తొలి పరీక్ష

ఆగ్రహతాపంతో దారి మళ్ళించిన ఉమర్ నేరుగా బావ ఇంటికి చేరారు. అక్కడ తన బావ సయీద్, చెల్లి ఫాతిమా, మరో ముస్లిమ్ ఖబ్బాబ్, కొత్తగా అవతరించిన దివ్య గ్రంథం వచనాలను పఠిస్తున్నారు. మహనీయ ఖబ్బాబ్ వారికి ఆ వచనాలను బోధ పరుస్తున్నారు. అన్నయ్య, తన ఇంట అడుగు పెట్టగానే సోదరి ఫాతిమా, మహనీయ ఖబ్బాబ్‌కు సంజ్ఞ చేశారు, ఆయన రెప్పపాటు కాలంలో ఇంట్లో ఓ మూలలో దాక్కున్నారు. ఆ క్షణంలోనే చెల్లి దివ్య వచనాల పత్రాలూ దాచేశారు. కాని మహనీయ ఉమర్ వారు చదువుతున్న శబ్దం విన్నారు, కాబట్టి కోపంతో ప్రశ్నలు వేశారు.

అంతే సమాధానానికి ముందే మహనీయ సయీద్ పైన చెయ్యి చేసుకోవడం మొదలెట్టారు. ఫాతిమా తప్పించే ప్రయత్నం చేయగా ఆమెను సయితం కోపంలో కొట్టారు, మాడు చిట్లింది. భార్యా భర్తలు ఇరువురు బాగా గాయపడ్డారు. యిద్దరినీ రక్త సిక్తమయిన దుస్తుల్లో చూసి ఆయన ఆగ్రహం చల్లారింది. వారు కూడా ధైర్యంగా, "అవును, మేము ఇస్లామ్ స్వీకరించాము. నిజ ధర్మం కొరకు మా ప్రాణాలనూ ధారపోయడానికి సిద్ధమే. ఎవరి దౌర్జన్యమూ మమ్మల్ని రుజు మార్గం నుంచి తప్పించ జాలదు" అని తెగేసి చెప్పారు.

మహనీయ ఉమర్ పూర్తిగా చల్లబడిపోయారు. "సరే, నాకు మీరు చదువుతున్న దేమిటో చూపండి" అన్నారు. అదొక పలచని పొర. అది చూపిస్తూ, "మీరు స్నానం చెయ్యనిదే దీన్ని ముట్టుకోలేరు" అన్నారు చెల్లి. మహనీయ ఉమర్ లేచి స్నానం చేసి పవిత్ర వచనాలను పఠించసాగారు. వచనాల ప్రభావం వల్ల ఆయన డోలలూగ సాగారు. "ఎంత విజ్ఞతా భరితమయిన వచనాలు, ఎంత ప్రభావశీలమయిన వచనాలు!" అన్నారు అప్రయత్నంగా. మహనీయ ఖబ్బాబ్(ర) చాటు నుంచి అంతా తిలకిస్తూ ఉన్నారు. ఆయన ముందుకు వచ్చి మహనీయ ఉమర్ ని మహనీయ సయీద్ ఇంటి నుంచి అర్కమ్ ఇంటికి తీసుకు వెళ్ళారు. అక్కడ ప్రవక్తశ్రీ(స) వద్ద ఆయన ఇస్లామ్ స్వీకరించారు.

## హిజ్రత్

మదీనాలోని తెగలు ఔస్, ఖజ్రజ్‌లలో చాలా మంది ఇస్లామ్ స్వీకరించిన తరువాత మక్కాలోని బాధిత ముస్లిములకు అక్కడికి వలస వెళ్ళే అనుమతి లభించింది. అప్పుడు జనులు తెగలవారిగా గుంపులు గుంపులుగా బయలుదేర సాగారు. మహనీయ ఉమర్(ర) కూడా ఇరువై మంది గ్రూపును తీసుకుని వెళ్ళి పోయారు. మిగతా అదీ తెగలోని ముస్లిములు మహనీయ సయీద్(ర) వెంట హిజ్రత్ చేశారు. వారిలో మహనీయ జైద్ బిన్ సాబిత్, మహనీయ ఖునైస్ ప్రభృతులు ఉన్నారు. ఇది హిజ్రత్ చేసిన అయిదవ గ్రూపు. మహనీయ సయీద్(ర) తన తోటివారితో మదీనా శివారు ప్రాంతంలోని బస్తీ కుబాలో మహనీయ రఫాఅ బిన్ అబ్దుల్ మున్జిర్ ఇంట బస చేశారు. ✤



# సలామ్...

## ఒక చిన్న మాట పెద్ద ఆత్మీయ బంధం

మేరాజుద్దీన్

**చార్మినార్** పక్కన బజార్‌లో రద్దీ. పండ్ల దుకాణం వద్ద ఒక చిన్న పిల్లవాడు తన తండ్రితో కలసి వస్తున్నాడు. ఎదురు నుంచి ఒక వృద్ధుడు కష్టంగా నడుస్తూ వస్తున్నాడు. ఆ పిల్లవాడు హఠాత్తుగా "అస్సలాము అలైకుమ్ దాదా!" అన్నాడు.

తాత ముఖం ఒక్కసారిగా వెలిగిపోయింది. ఆయన ఆ పిల్లవాడి తలపై చెయ్యి పెట్టి ఆశీర్వదిస్తూ "వ అలైకుముస్సలాం వ రహ్మతుల్లాహి వ బరకాతుహు బాబూ!" అన్నాడు.

అదే క్షణం, రద్దీ బజార్ మధ్య ఓ మధురమైన శాంతి వ్యాపించింది. చిన్నారుల నుండి పెద్దల దాకా సలామ్ శక్తి ఇంత గొప్పదని ఇది చూపిస్తుంది.

### బస్సులో అనుకోని పరిచయం

ఒక యువకుడు మలక్‌పేట్‌లో బస్సులో ఎక్కాడు. సీటు దగ్గర కూర్చున్న మరొక ప్రయాణికుడితో కళ్ళు కలిశాయి. సాధారణంగా ప్రయాణికులు మౌనంగా కూర్చుంటారు. కానీ ఆ యువకుడు నవ్వుతూ "అస్సలాము అలైకుమ్" అన్నాడు.

ఆ ప్రయాణికుడు సమాధానం ఇస్తూ.. "ఎక్కడికి వెళ్తున్నావు?" అని అడిగాడు. అలా ఇద్దరూ మాట్లాడుకుంటూ ప్రయాణం ముగిసే సరికి స్నేహితులయ్యారు. ఒక సాదాసీదా సలామ్ లేకపోయుంటే, వారు పరాయివారుగానే మిగిలిపోయేవారు.

### హాస్పిటల్‌లో ధైర్యం ఇచ్చిన సలామ్

ఒక వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స కోసం ఒంటరిగా కూర్చుంది. ఆందోళనతో, భయంతో వణికిపోతుంది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఒక నర్సు మృదువుగా "అమ్మా, అస్సలాము అలైకుమ్" అంది.

ఆ వృద్ధురాలు కన్నీరు తుడుచుకుంటూ.."వ అలైకుముస్సలాం బిడ్డా". ఒక్క మాట ఆమె హృదయంలో ధైర్యాన్ని నింపింది. సలాం కేవలం అభివాదం మాత్రమే కాదు, ధైర్యాన్నీ, ఆశనీ నింపే ఓ మంత్రం.

### కాలేజీ ప్రాంగణంలో స్నేహం పుట్టింది

ఒక కొత్త విద్యార్థి కాలేజీ ప్రాంగణంలో ఒంటరిగా నిలబడి ఉన్నాడు. కొత్త వాతావరణం, కొత్త ముఖాలు చూసి అసౌకర్యంగా ఉన్నాడు. దగ్గరికి వచ్చిన ఒక సహ విద్యార్థి "అస్సలాము అలైకుమ్ బ్రదర్" అన్నాడు.

ఆ మాట విన్న వెంటనే ఒంటరితనం గాలిలో కలిసిపోయింది. వారిద్దరూ కలసి క్లాస్‌కి వెళ్లారు. ఆ రోజు మొదలైన స్నేహం, జీవితాంతం కొనసాగింది.

ప్రవక్త ముహమ్మద్ (స.అ.వ) ఉపదేశించినట్టే "మీరు ఒకరినొకరు ప్రేమించాలంటే, మీ మధ్య సలాం విస్తరించండి."

సలామ్ అనేది మాట మాత్రమే కాదు, అది ఒక దుఆ, ఒక ఇబాదత్, ఒక ముస్లిం యొక్క గుర్తింపు. సమాజంలో విభేదాలు, ద్వేషం తగ్గించి, ప్రేమను పెంచే అద్భుతమైన సాధనం.

అందుకే మనం ఎక్కడైనా ముస్లింలను కలసినప్పుడు పెదవులపై మొదట పలకాల్సిన మాట-

"అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు"

దీని భావం 'నీపై శాంతి శ్రేయో శుభాలు వర్షించుగాక' అని. తోటి వారి శ్రేయాన్ని అభిలషించడమే సలామ్ ప్రధాన ఉద్దేశం. సలామ్ ఇస్లామ్ చిహ్నాలలో ఒకటి.

> **విశ్వసించిన ప్రజలారా! మీ ఇళ్లల్లోకి తప్ప ఇతరుల ఇళ్లల్లోకి ప్రవేశించకండి, ఇంటి వారి అంగీకారం పొందనంత వరకు, ఇంటి వారికి సలామ్ చేయనంత వరకు. ఈ పద్ధతి మీకు ఎంతో ఉత్తమమైనది. దీనిని మీరు పాటిస్తారని ఆశించబడుతోంది. (దివ్యఖుర్‌ఆన్ 24: 27)**

> **"ఇళ్లల్లోకి ప్రవేశించినప్పుడు, మీ వారికి సలాము చేయండి. ఇది మీ మేలు కొరకు చేయబడే ప్రార్థన. అల్లాహ్ తరపు నుండి నిర్ణయించబడినది. ఎంతో శుభవంతమైనది, పరిశుద్ధమైనది."**
> **(ఖుర్‌ఆన్ 24: 61)**

సలామ్ ప్రాముఖ్యత గురించి దివ్య ఖుర్‌ఆన్ గ్రంథమే కాకుండా ముహమ్మద్ ప్రవక్త బోధనల్లో కూడా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. సలామ్ ముస్లిముల మధ్య పరస్పరం ప్రేమాభిమానాలు పెంపొందించేందుకు, సంబంధాలను మెరుగుపరిచేందుకు గొప్ప ఆయుధం.

పరస్పరం సలాము చేసుకోవడం ద్వారా ముస్లిముల్లో ప్రేమాభిమానాలు పెంపొందుతాయని ప్రవక్త మహనీయులు చెప్పారు. ముస్లిముల హృదయాల్లో ప్రేమాభిమానాలు జనింపజేసేందుకు సలామ్ కీలకమైన ఆయుధం.

## సలామ్ ఎవరు ఎవరికి చేయాలి?

పండితులు, పామరులు, ప్రముఖులు, చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా ఎవరు ఎవరికైనా సలామ్ చేయవచ్చు. సలామ్ ప్రముఖులకే ప్రత్యేకం కాదు. సలామ్‌ను విస్తృత పరచాలని ప్రవక్త నొక్కి చెప్పారు. 'ప్రజలారా! సలామ్‌ను విస్తృతం చేయండి. భోజనం పెట్టండి. బంధువుల హక్కు నెరవేర్చండి. ప్రజలు ఆదమరచి నిద్రిస్తున్న వేళ (తహజ్జుద్) నమాజ్ చేయండి. మీరు నిశ్చింతగా స్వర్గంలో ప్రవేశిస్తారు.'

'మీకు ఎవరైనా గౌరవభావంతో సలాము చేస్తే అతనికి మీరు అంతకంటే ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలాము చెయ్యండి. లేదా కనీసం అదే విధంగానైనా చెయ్యండి' (దివ్యఖుర్‌ఆన్ 4:86)

మహాప్రవక్త (సఅసం) ఇలా తెలిపారు : 'తోటి ముస్లింపై ఆరు హక్కులున్నాయి. అందులో మొట్టమొదటిది సలాముకు జవాబు పలకడం.'

ముందుగా సలామ్ చేసే వారికి ఎక్కువ పుణ్యాలు లభిస్తాయి. ముందుగా సలామ్ చేయడం ప్రాముఖ్యత గురించి ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: 'తన తోటి వారికి ముందుగా సలామ్ చేసేవాడు అల్లాహ్ కు అత్యంత సన్నిహితుడు' అందుకే మనందరం సలామ్‌ను విస్తృతం చేద్దాం! దైవప్రసన్నతను చూరగొందాం.


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




**ఆర్షియా**

**మానవ జీవితం** ఎన్నో మార్పులను, పరిణామాలను ఎదుర్కొంటూ వచ్చింది. కానీ ప్రస్తుత కాలంలో మానవుని మనసును అత్యంత లోతుగా దెబ్బతీస్తున్న సమస్యలలో ఒకటి ఒంటరితనం. ఇది కేవలం శారీరక వేరుపాటు కాదు, మనిషి సమూహంలో ఉండీ తనను ఒంటరిగా, నిరుపయోగిగా భావించే మానసిక స్థితి. ఈ సమస్య చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు, పురుషుడు నుండి మహిళ వరకు, ప్రతి వర్గాన్నీ ఒకేలా వేధిస్తోంది.

## కుటుంబ వ్యవస్థ బలహీనత

పూర్వం పెద్ద కుటుంబాల్లో అందరూ కలసిమెలసి జీవించేవారు. బాధలు పంచుకునేవారు, సంతోషాలు పంచుకునేవారు, పిల్లలకు ఆడుకోవడానికి స్నేహితులు ఇంట్లోనే ఉండేవారు. కానీ ఇప్పుడు చిన్న కుటుంబాలు పెరగడం వల్ల, రోజువారీ వ్యవస్థ షెడ్యూల్ కారణంగా, దాంపత్య జీవితంలో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. భార్యాభర్తలు ఒకే ఇంట్లో ఉండీ ఒకరిని మరొకరు పట్టించుకోకపోవడం, పిల్లలకు సమయం లేకపోవడం- ఇవన్నీ కుటుంబ బంధాలను బలహీనపరుస్తూ ఒంటరితనాన్ని పెంచుతున్నాయి.

## సామాజిక నిర్లక్ష్యం

ఒక వ్యక్తి కష్టాల్లో ఉన్నప్పుడు సమాజం నుండి సహకారం లేకపోవడం అతడిని మరింత తీవ్రమైన ఒంటరితనంలోకి నెట్టేస్తుంది. చదువు పూర్తి చేసుకుని వ్యాపారం చేయాలనుకునే యువకుడికి ప్రోత్సాహం లభించకపోవడం, ఆర్థిక నష్టంలో ఉన్న వ్యక్తికి తోడ్పాటు దొరకకపోవడం- ఇవన్నీ మనిషి హృదయాన్ని చీల్చేస్తాయి. సమాజం మద్దతు ఇవ్వని సమయంలో, వ్యక్తి తనలోనే మునిగి, ఇతరుల నుండి దూరమవుతాడు.

## వ్యతిరేకమైన జీవనశైలి, ఆర్థిక ఒత్తిడి

ఉద్యోగాలు, వ్యాపారాలు, రోజువారీ బిజీ పనులు మనిషిని యాంత్రిక జీవనశైలిలోకి నెట్టేశాయి. ఉదయం నుండి రాత్రి వరకు కష్టపడుతూ, బంధువులకు సమయం కేటాయించలేకపోవడం, తాను ఒక యంత్రంలా మారిపోవడం సహజమైపోయింది. దీనికి తోడు అధిక ఖర్చులు, పెరిగిన అవసరాలు, విలాసవంతమైన జీవన ప్రమాణాల పోటీ, ఇవన్నీ వ్యక్తిని మానసికంగా విసిగిస్తూ, ఒంటరితనాన్ని మరింత బలపరుస్తున్నాయి.

## టెక్నాలజీ దుష్ప్రభావం

టెక్నాలజీ అనేది వరమూ, శాపమూ అవుతుంది. ఒకే ఇంట్లో నలుగురు ఉన్నా, ప్రతివాడు తన మొబైల్‌లో మునిగిపోవడం, సోషల్ మీడియాలో ఆన్‌లైన్ స్నేహాలు చేసుకుంటూ నిజ జీవిత సంబంధాలను విస్మరించడం- ఇవన్నీ ఒంటరితనానికి దారి తీస్తున్నాయి. ఈ వర్చువల్ బంధాలు ఎంత బలహీనమో కష్టకాలంలోనే తెలుస్తుంది.

### ఒంటరితనం ప్రభావాలు

➢ మానసిక ఆరోగ్యం: డిప్రెషన్, ఆందోళన, భయాలు.

➢ శారీరక ఆరోగ్యం: రోగనిరోధక శక్తి తగ్గి, గుండె జబ్బులు, రక్తపోటు.

➢ సామాజిక సంబంధాలు : దాంపత్య బంధాలు దెబ్బతిని, విడాకులు పెరగడం.

➢ పనితీరు : విద్యార్థులు చదువులో ఆసక్తి కోల్పోవడం, ఉద్యోగులు పనిలో వెనుకబడడం.

### మార్గదర్శకాలు- పరిష్కార దారులు

ఒంటరితనాన్ని దూరం చేయడానికి సమాజం, కుటుంబం, వ్యక్తి, ముగ్గురి పాత్ర అవసరం.

❖ కుటుంబ బంధాలను బలపరచడం, ఒకరినొకరు పట్టించుకోవడం.

❖ సామాజిక సేవల్లో భాగస్వామ్యం కావడం ద్వారా "నేను ఒంటరిగా లేను" అన్న భావన పెంపొందుతుంది.

❖ ఉపయోగకరమైన హాబీలు, ఆరోగ్య సంరక్షణ, వ్యాయామం- ఇవి మనసుకు ప్రశాంతత ఇస్తాయి.

❖ టెక్నాలజీని సమతుల్యంగా వాడడం.

❖ సానుకూల ఆలోచనలు పెంచుకోవడం.

❖ తన సామర్థ్యాలతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం.

❖ ఆధ్యాత్మికత : అల్లాహ్‌పై విశ్వాసం, జిక్ర్ (స్మరణ), దుఆ (ప్రార్థన), కృతజ్ఞత- ఇవి మానసిక శాంతి కలిగించే అద్భుత మార్గాలు.

### అల్లాహ్ తోడుగా ఉన్నాడు

ఒంటరితనం నిశ్శబ్దంగా వ్యాపించే వ్యాధి. ఇది మనిషి మనసుని, కుటుంబాన్ని, సమాజాన్ని క్రమంగా దెబ్బతీస్తుంది. ఈ సమస్యపై అవగాహన పెంపొందించడం, పరస్పర సంబంధాలను బల పరచడం అత్యంత కీలకం. ఆర్థిక ఒత్తిడి, టెక్నాలజీ ఆధిపత్యం, వ్యక్తిగత స్వార్థం- ఇవన్నీ మనిషిని ఒంటరిని చేస్తున్నాయి. అయితే, ప్రేమ, అనుబంధం, సహకారం, ఆధ్యాత్మికత మాత్రమే ఈ సమస్యకు నిజమైన మందు.

మనిషి తనలో తాను ఒంటరిని కాను- తనతోపాటు కుటుంబం, సమాజం, ముఖ్యంగా 'అల్లాహ్ తనకు తోడుగా ఉన్నాడనే విశ్వాసం' ఉండాలి. అదే విశ్వాసం మనిషిని కాపాడుతుంది, ముందుకు నడిపిస్తుంది.

# సెల్‌ఫోను- సమస్యలు

సెల్‌ఫోన్ చేతిలో లేని వ్యక్తి ఈనాడు లేడు అంటే అతిశయోక్తి కాదు. నేడు ఫోను ప్రాథమిక అవసరంగా మారిపోయింది అనవచ్చు. కొన్నిసార్లు (ల్యాండ్) ఫోన్ వల్ల తలెత్తే సమస్యలతో మతిపోతుంది. (ఇప్పటికి కొన్ని సంస్థలలో ల్యాండ్ ఫోన్ వాడుతున్నారు). ఉదాహరణకు మనం ఒక వ్యక్తికి ఫోన్ చేసినప్పుడు అతను ఉండకపోవచ్చు, రాగానే ఫోన్ చెయ్యమని సందేశం చెప్పి పెట్టేస్తాము. అతడు వచ్చి మీకు ఫోన్ చేసేసరికి మీరు ముఖ్యమైన పని (లేదా మీటింగ్)లో ఉంటారు. మళ్ళీ మీకు మెసేజ్ చెప్పి అతడు ఫోన్ పెట్టేస్తాడు. మళ్ళీ మీరు చేస్తారు, ఇలా షరా మామూలే. అయితే ఈ రోజుల్లో సెల్‌ఫోన్ల వల్ల ఈ సమస్యలు చాలా వరకు తగ్గినా, ఇంకా వీటివల్ల ఇప్పటికీ (కొన్ని) ఆఫీసు పనుల్లో జాప్యం జరుగుతూనే ఉంది. అలా జరగకుండా ఉండాలంటే కొన్ని మార్గాలు అవలంబించవచ్చు. మీకు కావలసిన వ్యక్తి దొరకనప్పుడు మరొకరి ద్వారా పని పూర్తి చేసుకోవడం ఒకటి. లేదా ఫలానా సమయానికి ఖచ్చితంగా ఫోన్ చేయమని అవతలి వ్యక్తికి మెసేజ్ ఇవ్వవచ్చు. తరచుగా ఫోన్లు చేసే వ్యక్తులకు మీకు రోజులో ఏ టైమ్ అనుకూలమో చెప్పడం వల్ల వారికీ, మీకు కూడా సమస్య తగ్గుతుంది. అన్‌లిమిటెడ్ కాల్స్ వల్ల అనవసర విషయాలు మాట్లాడుకోవడం జరుగుతుంది. ఇలా ఎక్కువ సమయం ఫోన్లు వాడడం వల్ల వినికిడి సమస్యతోపాటు అనేక ఆరోగ్య సమస్యలు కలగవచ్చు.

అలాగే ఇతరులకు ఏ టైమ్ అనుకూలమో మీరు తెలుసుకుని ఉంచుకోండి. కొందరు తమ అనుకూల సమయాన్ని విజిటింగ్ కార్డుల మీద కూడా ముద్రిస్తారు. ఇదెంతో మంచి పద్ధతి. వాట్సాప్‌లలో కూడా మనం ఇది గమనించవచ్చు. ఫోన్లకు జవాబు ఇచ్చే ఆన్సరింగ్ మెషిన్లను ఏర్పాటు చేయించుకోవడం ఒక పద్ధతి. ఇంటికి లేదా ఆఫీసుకు వచ్చే (ల్యాండ్ లైన్) ఫోన్లను (మీరు బయట తిరుగుతున్నప్పుడు) సెల్‌ఫోన్‌కు మార్పిడి చేసుకోవడం (డైవర్ట్ చేయడం) మరో పద్ధతి. ఇలా పలు రకాల పద్ధతులను పాటించడం ద్వారా ఫోన్ల సమస్యను పరిష్కరించుకోవచ్చు.

**- మంగళగిరి జీలాని**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

38 ఆయత్‌లు మదీనా అవతరణ

# 47. ముహమ్మద్

## ప్రవేశిక

**పేరు:** రెండవ ఆయత్ "మరెవరయితే ముహమ్మద్‌కు అవతరించిన దాన్ని నమ్మారో" అన్న దాన్నుండి గ్రహించడం జరిగింది. భావమేమిటంటే ఇది మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) పేరు ప్రస్తావనకు వచ్చిన సూరా అన్నది. ఇదేకాక దీని ప్రముఖమయిన మరో పేరు "కితాల్" (యుద్ధం) అన్నది. అది 20వ ఆయత్‌లోని వాక్యం నుండి గ్రహించబడింది.

**అవతరణ కాలం:** ఇందులో వచ్చిన విషయాలు, ఈ సూరా, హిజ్రత్ తరువాత మదీనాలో అవతరించిందని సాక్ష్యం పలుకుతున్నాయి. అప్పటికి యుద్ధానికి ఆదేశాలయితే అవతరించాయి కాని ఇంకా యుద్ధం ఆచరణాత్మకంగా జరగలేదు. దీని సవివరమయిన ఆధారాలు ముమ్ముందు పాదసూచిక 8లో వస్తున్నాయి.

**చారిత్రక పూర్వరంగం:** ఈ సూరా అవతరించిన కాలంలోని పరిస్థితుల స్వరూపం చాలా ఇబ్బందికరంగా ఉండేది. ప్రత్యేకంగా మక్కా పుణ్యపురిలోనూ సర్వ సాధారణంగా అరేబియా భూభాగం అంతటా ముస్లిములను హింసా దౌర్జన్యాలకు గురిచేస్తూ ఉన్నారు, వారికి జీవితం మరీ దుర్భరమయిపోయేలా చేస్తున్నారు. ముస్లిములు అన్ని వైపుల నుంచీ ప్రోగయి నెమ్మది నెలవయిన మదీనా పవిత్ర నగరిలో ఏకత్రమయ్యారు. కాని కురైష్ తిరస్కారులు ఇక్కడా వీరిని ప్రశాంతంగా కూర్చో నివ్వడానికి సిద్ధంగా లేరు. మదీనా చిరు నగరం అన్ని వైపుల నుండి తిరస్కారుల ఉచ్చులో చిక్కుకుని ఉండేది. వారు దాన్ని రూపుమాపాలని కంకణబద్ధులయి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ముస్లిములకు రెండే మార్గాలు మిగిలాయి. వారు సత్యధర్మాన్ని ప్రచారం చెయ్యడమే కాదు దాని అనుసరణను సయితం వదలుకుని అజ్ఞానం సమక్షంలో దాసోహమనాలి. లేదా చావటానికీ చంపడానికీ లేచి నిలబడాలి. సర్వశక్తులూ ధారబోసి, అరబ్బు భూభాగంలో ఇస్లామ్ బ్రతికి బట్ట కట్టాలా లేదా అజ్ఞానమే మిగలగలగాలా అన్న విషయాన్ని చిరకాలానికి నిర్ణయించాలి. ఈ సందర్భంలో పరమ ప్రభువు, విశ్వాసులకు సముచితమయిన ఒకే దారిని, ధైర్య సాహసాలతో కూడిన దారినే చూపాడు. ఆయన తొలుత హజ్జ్ సూరా (39వ ఆయత్)లో వారికి యుద్ధానికి అనుమతినిచ్చాడు. తరువాత బకర సూరా (ఆయత్:190)లో దాని ఆదేశమిచ్చాడు. కాని ఆ సందర్భంలో యుద్ధం అంటే అర్థమేమిటో ప్రతి వ్యక్తికీ బాగా తెలుసు. అప్పట్లో మదీనాలో విశ్వసించినవారు పిడికెడు మందితో కూడిన సంఘం. అది ఒక్క వెయ్యి మంది అయినా యుద్ధయోధులను సమాయత్తపరచడానికీ సామర్థ్యం కలిగి లేదు. అరేబియాలోని అజ్ఞానం అంతటినీ ఎదురొడ్డి ఢీకొనేందుకు కరవాలం చేతపట్టి నిలబడాలని దానికి ఆదేశమయింది. పైగా పోరాటానికి అవసరమయిన యుద్ధసామగ్రిని ఆ బస్తీవాసులు తమ నోటికాడి అన్నం మానుకుని కూడా అతి కష్టంగానూ సన్నద్ధపరచుకోజాలరు. అందులో ఇంకా వందలాది మంది ఇల్లూ వాకిలీ కోల్పోయిన ముహాజిర్లు (శరణార్థులు) ఉన్నారు. వారు ఇంకా పూర్తిగా స్థిరమయిన నివాసమూ ఏర్పరచుకోలేకపోయారు. నలువైపుల నుండి అరేబియా వాసులు ఆర్థిక బహిష్కరణ చేసి వారి నడుములూ విరగ్గొట్టారు.

**ప్రధాన విషయం, చర్చనీయాంశం:** ఈ పరిస్థితుల్లో ఈ సూరా అవతరించింది. దీని ప్రధాన విషయం విశ్వాసులను యుద్ధం కోసం సన్నద్ధపరచడం, వారికి ఈ సందర్భంలో ప్రారంభ నిర్దేశాలు అందజేయడం. దీనికి అనుకూలంగానే ఈ సూరాకు 'కితాల్' అని కూడా పేరు పెట్టడం జరిగింది. ఇందులో క్రమంగా దిగువ పేర్కొన్న విషయాలు చర్చించబడ్డాయి:

ప్రారంభంలో, ఇప్పుడు రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగనున్నదని తెలుపడం జరిగింది. ఒక వర్గం, సత్యాన్ని స్వీకరించడాన్ని తిరస్కరించింది, దైవమార్గంలో అడ్డు గోడగా నిలిచింది. రెండవ వర్గం దైవం వద్దనుంచి ఆయన దాసుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)కు అవతరించిన ఆ సత్యాన్ని అంగీకరించింది. ఇప్పుడు పరమ ప్రభువు నిర్ణయం ప్రకారం తొలివర్గం చేస్తున్న సమస్త కృషి, శ్రమలను అల్లాహ్ వ్యర్థం చేసి వేశాడు, రెండవ వర్గం పరిస్థితులను చక్కబరిచాడు.

**(ప్రవేశిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ
## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం
(కితాబుత్తఫ్సీర్)

**2. అల్ బఖరా**

**అధ్యాయం : 6**

## ఎవరయితే జిబ్రీల్(అ) పట్ల శత్రుత్వం కలిగి ఉంటారో...

**331)** హజ్రత్ అనస్(రజి) కథనం: (యూదుల గొప్ప విద్వాంసుడైన) అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి), ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనాకు (హిజ్రత్ చేసి) వచ్చారని విన్నప్పుడు, ఆయన తన తోటలో పండ్లు కోస్తున్నారు. ఈ సమాచారం విన్న వెంటనే ఆయన దైవప్రవక్త(స) సమక్షంలో హాజరై, 'ఒక్క దైవప్రవక్తకు తప్ప మరెవరికీ తెలియని మూడు విషయాలను గురించి మిమ్మల్ని అడుగుతాను. సమాధానం చెప్పండి– 1) ప్రళయ సూచనలలో అన్నిటికన్నా మొదటి సూచన ఏది? 2) స్వర్గవాసుల ఆతిథ్యం కొరకు అన్నింటికన్నా ముందు వడ్డించబడే భోజన పదార్థం ఏది? 3) (పుట్టబోయే) శిశువుకు ఎప్పుడు తండ్రి పోలికలు వస్తాయి? ఎప్పుడు తల్లి పోలికలు వస్తాయి?– సమాధానంగా దైవ ప్రవక్త(స) ఇలా అన్నారు: "జిబ్రయీల్(అ) ఇప్పుడే వచ్చి నాకు ఈ విషయాలను గురించి చెప్పారు. 'ఏమిటి, జిబ్రీల్ వచ్చి చెప్పారా?' అని అడిగారు అబ్దుల్లాహ్. 'అవును'ని దైవప్రవక్త(స) అనగానే, 'అతను యూదులకు శత్రువు' అని అబ్దుల్లాహ్ అభిప్రాయపడ్డారు. అప్పుడు దైవప్రవక్త(స) ఈ ఆయత్‌ను పఠించారు: **"మన్ కాన అదువ్వన్ లి జిబ్ రీల... (2:97)** (జిబ్రీల్ పట్ల విరోధం ఉన్న ప్రతివాదూ ఈ యథార్థాన్ని గ్రహించాలి. అల్లాహ్ ఆజ్ఞతోనే ఆయన ఈ ఖుర్ఆన్‌ను నీ హృదయ ఫలకంపై అవతరింపజేశాడు. పూర్వం వచ్చిన అన్ని గ్రంథాలనూ అది ధ్రువీకరిస్తుంది...) తరువాత ఆ మూడు ప్రశ్నలకు సమాధానంగా ఆయన (స) ఇలా అన్నారు : 1) ప్రళయ సూచనలలో ఒకటి అగ్ని. అది మనుషులను తూర్పు నుండి పడమర వైపునకు సమీకరిస్తుంది. 2) స్వర్గవాసులకు అన్నిటికన్నా ముందు భోజనంగా వడ్డించబడే ఆహార పదార్థం చేప కార్జంలో (పెరిగివున్న) భాగం. 3) ఇక శిశువు పోలికల విషయానికి వస్తే, పురుషుని వీర్యబిందువు స్త్రీ వీర్య బిందువుపై ఆధిపత్యం వహించినప్పుడు శిశువుకు తండ్రి పోలికలు వస్తాయి. స్త్రీ వీర్య బిందువు పురుషుని రేతస్సుపై ఆధిక్యత వహించినప్పుడు శిశువుకు తల్లి పోలికలు వస్తాయి". ఈ సమాధానం విని అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి),'అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని, మీరు దైవ సందేశహరులని నేను సాక్ష్యమిస్తున్నాను' అన్నారు. (ఆ తరువాత ఆయన ఇలా విన్నవించుకున్నారు). 'దైవప్రవక్తా! యూదులు అపవాదులు మోపటంలో ఆరితేరిన జనులు. మీరు నా గురించి వారి అభిప్రాయం అడిగి తెలుసుకునే ముందు, నేను ఇస్లామ్ స్వీకరించానన్న సంగతి వారికి తెలిస్తే, నా మీద ఎన్నో నీలాపనిందలు మోపడానికి వెనుకాడరు'.

తరువాత యూదులు వచ్చినప్పుడు, "మీ దృష్టిలో అబ్దుల్లాహ్ బిన్ సలామ్ ఎటువంటి వారు?" అని దైవప్రవక్త(స) అడిగారు. దానికి వారు, 'ఆయన మా అందరిలోకీ ఉత్తముడు. మాలో అందరికన్నా ఉత్తముడైనవాని కుమారుడు. ఆయన మా నాయకుడు. మా నాయకుని కుమారుడు' అని సమాధానం ఇచ్చారు. "ఒకవేళ ఆయన ఇస్లామ్ స్వీకరించే మాటైతే, అప్పుడు మీరేమంటారు?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, 'దేవుడు ఆయన్ని దాని బారి నుండి రక్షించుగాక!' అని వారు జవాబిచ్చారు. అంతలోనే అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) అందరి సమక్షంలో హాజరై 'అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్ దైవప్రవక్త అని నేను సాక్ష్యం పలుకుతున్నాను' అన్నారు. ఈ పలుకు వినగానే అక్కడున్న యూదులు, 'ఇతను మాలో అందరికన్నా అధముడు. అందరికన్నా అధముడైన వాని కుమారుడు' అంటూ ఆయన్ని కించపరచటం మొదలెట్టారు. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి), 'దైవప్రవక్తా! వీళ్ళు ఇలా వ్యవహరిస్తారని నేను ముందు నుంచే భయపడుతూ ఉన్నాను' అన్నారు.

**నసీమ్ సుల్తాన**



# ఆత్మహత్య

## అన్ని విధాల అనర్థదాయకం

**మనిషి జీవితం ఎంతో విలువైనది.** మానవ జన్మ సర్వోత్తమమైనది. మన జీవితానికి గల పరమార్థం 54ఫ్రై తెలుసుకొని, దాన్ని సార్థకం చేసుకోవాలంటే ఎలా జీవించాలో తెలుసుకోవాలి. కష్టాలకు ఓర్చుకొని జీవితాన్ని కొనసాగించాలి. అయితే నేడు చిన్న చిన్న విషయాలకే కలత చెంది ఆత్మహత్య చేసుకొనే ధోరణి పెరగడం ఆందోళన కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో ఇస్లాం బోధించిన ఓర్పును వహిస్తూ.. జీవితంలో వచ్చే కష్టాలను అల్లాహ్ పెట్టిన పరీక్షలుగా భావించి ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలి. అల్లాహ్ సూచించినట్లుగా ధర్మ మార్గంలో జీవిస్తూ జీవితాన్ని ధన్యం చేసుకోవాలి.

ప్రతి మనిషికి జీవితం అంటే చాలా ఇష్టం. బహుశా ప్రపంచంలో జీవితాన్ని ఇష్టపడని వ్యక్తి ఎవరూ ఉండరేమో. కానీ ప్రపంచంలో చాలా మంది జీవితాన్ని నిజంగా అర్థం చేసుకొని జీవించడం లేదు. కొన్నిసార్లు చిన్నపాటి నిరాశ కూడా వారి జీవిత లక్ష్యాలను నాశనం చేస్తున్నట్లు కనిపిస్తున్నది. కొన్నిసార్లు ప్రపంచంలోని కష్టాలకు తట్టుకోలేక, తమ ఆప్తులను విడిచిపెట్టి, ఎవరూ తిరిగి రాని చోటుకి వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ చర్యనే ఆత్మహత్య అంటారు.

మనిషి పుట్టినప్పటి నుండి మరణించే వరకు వివిధ దశల గుండా వెళ్తాడు. కొన్నిసార్లు సంతోషాలు అతని ఒడిలో ఉంటే, కొన్నిసార్లు అతని జీవితం కన్నీళ్లతో నిండిపోతుంది. కొన్నిసార్లు అతడిపై చాలా ఎక్కువ ఒత్తిడి పడుతుంది. అది భరించలేనిదిగా ఉంటుంది. దీనివల్ల అతను తన జీవితం నుండి విముక్తి పొందడానికి ప్రయత్నిస్తాడు. కొన్నిసార్లు అతను అందులో సఫలమై తన ప్రాణాలను తీసుకుంటాడు. అయితే పరిస్థితులు కొన్నిసార్లు వేరుగా ఉండవచ్చు. ఉదాహరణకు, చిన్న వయస్సులో తల్లిదండ్రులు మరణించడం, యవ్వనంలో ఆత్మీయులను కోల్పోవడం, దీర్ఘకాలిక అనారోగ్యం, నిరుద్యోగం, వ్యసనం, చెదిరిన ఆలోచనల ప్రవాహం మొదలైనవి. ఈ కారణాలు మనిషి జీవితంలో ఎప్పుడైనా విషాదాన్ని నింపగలవు. ఈ పరిస్థితుల్లో మంచి స్నేహితులు లేదా నమ్మకమైన ఆప్తులు లేకపోతే ఆత్మహత్యే ఏకైక పరిష్కారంగా భావిస్తారు.

### విద్యార్థులలో ఆత్మహత్యలు

భారతదేశంలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం చాలా కాలం నుండి జరుగుతున్నది. సమాజంలో మంచి స్థానం పొందడం, పెద్ద విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందడం వంటి కలలను నెరవేర్చుకోవడంలో విద్యార్థులు అంతర్గత, బాహ్య ఒత్తిడిని ఎదుర్కొంటారు. పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం, తోటి విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధించే ప్రయత్నాల్లో వారు మరింత మానసిక ఒత్తిడికి గురవుతారు. కొన్నిసార్లు విజయం సాధించాలనే ఒత్తిడి, వైఫల్య భయం చాలా ఎక్కువగా ఉంటాయి. దాని ఫలితం ప్రతికూలంగా ఉంటుంది. పరీక్షల భయం విద్యార్థులకు ఎక్కువగా

ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. 140 కోట్ల జనాభా కలిగిన మన దేశంలో ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశం కోసం విద్యార్థులు తీవ్రంగా పోటీ పడాలి. చదువుల్లో విజయం సాధించని పక్షంలో చాలా మందికి జీవితాన్ని ముగించడమే ఏకైక మార్గంగా కనిపిస్తోంది. ఓ నివేదిక ప్రకారం, భారతదేశంలో విద్యార్థులలో ఆత్మహత్యల ధోరణి రోజురోజుకూ పెరుగుతోంది. దీనికి ఒక ప్రధాన కారణం పరీక్షలలో వైఫల్యం.

## రైతులలో ఆత్మహత్యలు

భారతదేశంలో 60 శాతం మంది ప్రజల జీవనం వ్యవసాయంపై ఆధారపడి ఉంది. రైతులు ఉత్పత్తి చేసే ఆహారాన్నే దేశమంతా తింటుంది. అయితే ఆహారాన్ని పండించడానికి ఒక్కో రైతు ఎంత కష్టపడతాడో ప్రజలు ఒక్క క్షణం కూడా ఆలోచించరు. ప్రజలు ఆ ధాన్యాన్ని వ్యాపారుల నుండి ఎక్కువ ధరకు కొంటారు. కానీ రైతులు మాత్రం గిట్టుబాటు ధర లభించక తన ప్రాథమిక అవసరాలను కూడా తీర్చుకోలేక పేదరికం, కష్టాల వల్ల విసిగి పోయి ఆత్మహత్యలకు పాల్పడతారు. NCRB (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) నివేదిక ప్రకారం, భారతదేశంలో ప్రతిరోజూ 46 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. 1995 నుండి 2013 వరకు 18 సంవత్సరాలలో 2,95,438 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. భారతదేశంలో మొత్తం ఆత్మహత్యల రేటులో రైతు ఆత్మహత్యల వాటా 11.2 శాతం. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2009లో సుమారు 13,500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు జరిగిన రాష్ట్రాలలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ముందున్నాయి. గత పదేళ్లలో సేకరించిన రైతుల ఆత్మహత్యల రికార్డులో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. కర్ణాటకలో 2,282 మంది రైతులు తమ ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమ బెంగాల్‌లో 1,054, రాజస్థాన్‌లో 851, ఉత్తరప్రదేశ్‌లో 656, గుజరాత్‌లో 588, హర్యానాలో 230మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులు ఈ తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి రుతుపవనాల అనిశ్చితి, గిట్టుబాటు ధర లేకపోవడం, అప్పుల భారం, పంటలు నష్టపోవడం, ప్రభుత్వ విధానాలు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలు మొదలైనవి కారణాలుగా తేలాయి.

## ఆత్మహత్యలకు కారణాలు

❖ ఆత్మహత్యకు ఒక ప్రధాన కారణం మానసిక సమస్యలు. మనిషి అభివృద్ధి చెందుతున్న కొద్దీ అతని మానసిక సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఈ సమస్యలకు అతి పెద్ద కారణం మీడియా. టీవీలో చూపించే దాదాపు ప్రతి కార్యక్రమం, సీరియల్, డ్రామా, సినిమా, చివరికి కార్టూన్లలో కూడా మగ, ఆడవారి ప్రేమను చూపిస్తారు. దీని ప్రభావం ఎక్కువగా యువతపై పడుతోంది. దీని ఫలితంగా వారి మనసుపై అలాంటి మత్తు ఆవహిస్తుంది. దీంతో వారు తమ జీవిత లక్ష్యాల కంటే ప్రేమకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం ప్రారంభిస్తారు. అప్పుడు మీడియా కార్యక్రమాల్లోని కల్పిత పాత్రలను నిజ జీవితంలో అనుకరించడానికి ప్రయత్నిస్తారు. ప్రేమను పొందడంలో వైఫల్యం చెందినప్పుడు వారిని నిరాశ ఆవహిస్తుంది. ఫలితంగా, వారు ఎవరూ ఊహించని విధంగా ప్రమాదకరమైన చర్యలకు పాల్పడతారు. ఇది వారి తల్లిదండ్రులు, ఆప్తులకు జీవితాంతం శోకాన్ని మిగిలిస్తుంది.

❖ ఆత్మహత్యకు మరో ప్రధాన కారణం పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించడం. ప్రతి విషయాన్ని తమతో పంచుకునేలా, ప్రతి సమస్యలో తమ సలహా తీసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచాలి. పిల్లల భావాలు, భావోద్వేగాలను గౌరవించాలి. కొన్నిసార్లు తల్లిదండ్రుల కఠినత్వం, నిర్లక్ష్యం భావోద్వేగ విచ్ఛిన్నానికి కారణమవుతాయి. దీనివల్ల పిల్లలు మానసికంగా బలహీనపడి, తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవడానికి కూడా వెనుకాడరు.

❖ సోషల్ మీడియాను విపరీతంగా ఉపయోగించడం కూడా ఆత్మహత్యకు ఒక కారణం. ఇది బంధాలలో దూరాన్ని సృష్టించడమే కాకుండా, తల్లిదండ్రులను తమ పిల్లల కోసం సమయం కేటాయించలేనంత బిజీగా ఉంచుతోంది. చాలా మంది తమకు దూరంగా ఉన్న సోషల్ మీడియాలో పరిచయమైన వారి కోసం బాధ పడుతూ కనిపిస్తారు. కానీ తమ సొంత ఇంట్లో అయినవారి బాగోగుల గురించి వారికి తెలియదు.

పిల్లలలో తిరుగుబాటు ఆలోచనలకు ఒక ప్రధాన కారణం తల్లిదండ్రులు అతిగా గారాబం చేయడం లేదా అతిగా కఠినంగా ఉండటం. ఈ రెండు పరిస్థితులు నష్టానికి కారణమవుతాయి. తల్లిదండ్రులు, పిల్లల మధ్య దూరాన్ని సృష్టిస్తాయి. అతి గారాబం మనిషిని దురుసుగా, మొండిగా చేస్తుంది. అదే సమయంలో అనవసరమైన కఠినత్వం అతడిని అప నమ్మకానికి గురి చేస్తుంది. కొందరు తమ పిల్లలను అనుమానంతో చూస్తారు. కొందరు పిల్లలపై తల్లిదండ్రుల భయం తీవ్రంగా ఉంటుంది. దీని ఫలితంగా పిల్లలు చాలా పనులను రహస్యంగా చేయడం ప్రారంభిస్తారు. అలాంటి పిల్లలు ఏ మార్గంలో వెళ్తున్నారో తల్లిదండ్రులకు తెలియదు. ఇలాంటి వాటితో పాటు ఆత్మహత్యకు అనేక ఇతర కారణాలు కూడా ఉండవచ్చు. ఉదాహరణకు, లక్ష్య సాధనలో వైఫల్యం (ప్రేమించిన వారితో వివాహం జరగకపోవడం,

పరీక్షలో ఫెయిల్ అవడం), కుటుంబ కలహాలు (పిల్లలు, తల్లిదండ్రుల మధ్య, భార్యాభర్తల మధ్య, అత్తా కోడలు మధ్య, వదిన-ఆడపడుచు మధ్య), పేదరికం, అప్పులు, ఆడపిల్లల పెళ్లి సమస్య, నిరుద్యోగం, అనారోగ్యం, పరువు నష్టం (ఉదాహరణకు, ఒక రహస్య పాపం బయటపడుతుందనే భయం), ప్రాణ, ఆర్థిక నష్టం (వ్యాపారంలో నష్టం రావడం, చాలా ప్రియమైన వ్యక్తి చనిపోవడం) మొదలైనవి. ఆత్మహత్య చేసుకునే వ్యక్తి తన జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా, తన ఆప్తులను కూడా తీవ్రమైన మానసిక బాధలకు గురి చేస్తాడు. అవి కూడా తక్కువేం కాదు. ఆత్మహత్య చేసుకునే వ్యక్తి తన మరణం తర్వాత తన కుటుంబం ఎలాంటి కష్టాలను ఎదుర్కొంటుందో ఆలోచిస్తే, బహుశా అతను తన నిర్ణయాన్ని విరమించుకుని జీవించడానికి ప్రాధాన్యత ఇస్తాడు.

## ప్రపంచ దేశాల్లో ఆత్మహత్యల పరిస్థితి

W.H.O (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నివేదిక ప్రకారం, ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది లక్షల మందికి పైగా ప్రజలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ విషయంలో లిథువేనియా, ఘనా, దక్షిణ కొరియా, శ్రీలంక, కజకిస్థాన్, స్లోవేనియా, హంగరీ, జపాన్, లాత్వియా, బెలారస్, భారతదేశం ముందు వరుసలో ఉన్నాయి. ఈ దేశాల జాబితాలో ఎక్కువగా యూరోపియన్ దేశాలున్నాయి. ఇక్కడ లౌకిక, ఉదారవాద వ్యవస్థలు ఉన్నాయి. ఇక్కడ ప్రతి వ్యక్తికి అన్ని రకాల స్వేచ్ఛ ఉంది. మహిళలు, పురుషులు, యువకులు, వృద్ధులు, పిల్లలు అందరూ స్వతంత్రులు. మత నియంత్రణలు ఈ దేశాల్లో లేవు. ఆత్మహత్యల విషయంలో ముందున్న దేశాలు పేదవేమీ కాదు. ఇక్కడ గమనించదగిన విషయం ఏమిటంటే ఎక్కువగా ఆత్మహత్యలు జరిగే పన్నెండు దేశాలలో ముస్లిం దేశం ఒక్కటి కూడా లేదు. జపాన్‌లో ఆత్మహత్యపై ఎటువంటి నిషేధం లేదు. ఇక్కడ ఆత్మహత్యను పవిత్రమైన, ధైర్యవంతమైన చర్యగా భావిస్తారు. జపాన్ పౌరులు చిన్న చిన్న విషయాలకే తమ ప్రాణాలను తీసుకుంటారు. 2006 వరకు ఆత్మహత్యల సంఖ్యలో జపాన్ ఆసియా దేశాలలో మొదటి స్థానంలో ఉంది. కానీ తర్వాత దక్షిణ కొరియా దానిని అధిగమించింది.

## భారతదేశ పరిస్థితి

నివేదికల ప్రకారం, భారతదేశంలో గత సంవత్సరం ప్రతి గంటకు సుమారు 15 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విధంగా 1,33,623 మందికి పైగా ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. ఎన్సీఆర్బీ అధికారిక నివేదిక ప్రకారం, ఈ విషయంలో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. నగరాలలో చెన్నై ముందుంది. ఆత్మహత్య చేసుకున్న వారిలో 69.7% మంది వార్షిక ఆదాయం ఒక లక్ష రూపాయల కంటే తక్కువ ఉందని పేర్కొంది. ఆత్మహత్య చేసుకున్న ప్రతి ఆరుగురిలో ఒకరు గృహిణి అని పేర్కొంది. 2014లో మహారాష్ట్రలో 16,307, తమిళనాడులో 16,122, పశ్చిమ బెంగాల్‌లో 14,310 ఆత్మహత్యలు జరిగాయి. పెద్ద నగరాలలో చెన్నైలో అత్యధికంగా (2,214) ఆత్మహత్యలు జరిగాయి. బెంగళూరులో 1906 మంది, ఢిల్లీలో 1847 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆత్మహత్యల్లో పురుషులు, మహిళల సంఖ్య వరుసగా 68, 32 శాతంగా ఉంది. 41.8% మంది ఉరి వేసుకుని, 26% మంది విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. 6.9% మంది నిప్పు పెట్టుకుని, 6.5% మంది నీటిలో దూకి, 1.1% మంది భవనం నుండి దూకి లేదా రైలు కింద పడి తనువు చాలించారు.

(సచ్ టైమ్స్, 20 జూలై 2015)

## ఇస్లామిక్ దృక్పథం

జీవితానికి, మరణానికి నిజమైన యజమాని అల్లాహ్. ఇస్లాంలో మానవ జీవితం చాలా విలువైనదిగా పరిగణించబడింది. ఎవరైనా ఒక వ్యక్తి మరొక వ్యక్తిని అన్యాయంగా చంపితే, ఇస్లాం దానిని మొత్తం మానవాళిని చంపినదానితో సమానంగా పరిగణిస్తుంది. ఇస్లాం ఆత్మహత్యను హరామ్ (నిషిద్ధం)గా ప్రకటించింది. ఒక వ్యక్తి శరీరం, జీవితం వాస్తవానికి అతని వ్యక్తిగత ఆస్తి కాదు, అవి అల్లాహ్ నుండి వచ్చిన అమానత్ (అప్పగింత). దీనిని మోసం చేసే వ్యక్తి ప్రళయం రోజు అల్లాహ్ ముందు జవాబు చెప్పవలసి ఉంటుంది. ఈ ప్రపంచంలో ఏ సంఘటన కూడా యాదృచ్ఛికంగా జరగదు, కానీ అల్లాహ్ కోరుకున్నది మాత్రమే జరుగుతుంది. ఆయన ఎప్పుడు కోరుకుంటే సరిగ్గా అప్పుడే జరుగుతుంది. ఇందులో ఒక్క క్షణం కూడా ఆలస్యం ఉండదు. అల్లాహ్ ఆజ్ఞ లేకుండా ఒక్క ఆకు కూడా దాని స్థానం నుండి కదలదు. కారణం లేకుండా తన జీవితాన్ని ముగించడం లేదా ప్రమాదంలో పడవేయడం కూడా చాలా అసహ్యకరమైనది. అల్లాహ్ యొక్క వాక్యం ఇలా ఉంది:

“ అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టండి. చేతులారా మిమ్మల్ని మీరు వినాశంపాలు చేసుకోకండి. మేలు చెయ్యండి. మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. (దివ్యఖుర్ఆన్ 2: 195)

మరొక చోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

“ మిమ్మల్ని మీరు చంపుకోకండి. అల్లాహ్‌కు మీరంటే ఎంతో దయ అని నమ్మండి. హింసా దౌర్జన్యాల ద్వారా అలా చేసేవాణ్ణి మేము తప్పకుండా అగ్నిలో పడవేస్తాము.”

(దివ్య ఖుర్ఆన్ 4: 29-30)

## ప్రపంచం ముస్లింకు ఒక పరీక్ష

అల్లాహ్ ఈ ప్రపంచాన్ని సంతోషం-దుఃఖం, కష్టసుఖాలు, పేదరికం- సంపద ఉండేలా సృష్టించాడు. ప్రతి మనిషి ఈ పరిస్థితులను ఎదుర్కోవాలి. ఈ పరిస్థితుల ద్వారా మనిషిని అల్లాహ్ పరీక్షిస్తాడు. అల్లాహ్ యొక్క వాక్యం ఇలా ఉంది:

"మీలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించి చూద్దామని ఆయన చావు బ్రతుకులను సృష్టించాడు. ఆయన అత్యంత శక్తిసంపన్నుడు, అత్యధికంగా మన్నించేవాడూను." (దివ్యఖుర్‌ఆన్ 67: 2)

ఈ వాక్యం ప్రకారం అల్లాహ్ మనుషులను పరీక్షించడానికి సృష్టించాడని, వారు ఎలాంటి పనులు చేస్తారో చూడటానికి అని తెలుస్తుంది. ఖురాన్‌లోని అనేక ఇతర వాక్యాలలోనూ మానవుల సృష్టి లక్ష్యం వారిని పరీక్షించడం అని పేర్కొనబడింది. ఎవరు అల్లాహ్‌కు కృతజ్ఞులు, ఎవరు కృతజ్ఞత లేనివారు? ఎవరు ఓర్పును పాటిస్తారు, ఎవరు తప్పుడు మార్గాన్ని ఎంచుకుంటారు? అని తెలుసుకోవడానికి మానవుల సృష్టి జరిగింది.

" భయప్రమాదాలకు, ఆకలి బాధకు ధన, ప్రాణ, ఆదాయాల నష్టానికి గురిచేసి మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము.
(దివ్య ఖుర్‌ఆన్ 2: 155)

## ఓర్పు మాత్రమే ఏకైక పరిష్కారం

మానవ జీవితంలో సుఖదుఃఖాలు కలిసి ఉంటాయి. మనిషి జీవితంలో కొన్నిసార్లు సంతోషాలు, కొన్నిసార్లు కష్టాలు వస్తాయి. ఒక విద్యార్థికి పరీక్షలో కొన్ని కష్టమైన, కొన్ని సులభమైన ప్రశ్నలు ఇచ్చినట్లే, మనిషికి కూడా కష్టం, సులభమైన సవాళ్ల ద్వారా పరీక్ష ఉంటుంది. ఈ పరిస్థితిలో, ఖురాన్ మనిషి సులభమైన పరిస్థితుల్లో తన ప్రభువుకు కృతజ్ఞుడుగా ఉండాలని, కష్టమైన పరిస్థితుల్లో ఓర్పుతో వ్యవహరించాలని బోధిస్తుంది. కష్టమైన పరిస్థితుల్లో ఓర్పు చాలా సానుకూల చర్య. మనిషి ఈ పరీక్షలో నెగ్గినప్పుడు, దైవిక శక్తులు అతనికి మద్దతుగా వస్తాయి. ప్రవక్త ముహమ్మద్ (స) కూడా అనేక పరీక్షలను ఎదుర్కొన్నారు. అలాంటి సందర్భాలలో ఆయన అవలంబించిన వైఖరి మనకు మార్గదర్శకం. కష్టమైన పరిస్థితుల్లో ఆయన ఎల్లప్పుడూ తన ప్రభువు వైపు మొగ్గు చూపి నమాజ్ చేసేవారు. పిల్లల మరణ దుఃఖం లేదా అజ్ఞానులు చేసే రాళ్ళ దాడి, కపటుల కుట్రలు లేదా ఇస్లామ్ శత్రువుల దాడులు కావచ్చు.... అన్ని పరిస్థితులలో ఆయన తన ప్రభువు ముందు నిలబడి నమాజ్, ఓర్పు ద్వారా సహాయం కోరేవారు. అల్లాహ్ ఓర్పు వహించే వారికి తన సాన్నిధ్యాన్ని గౌరవంగా ఇచ్చాడు. ఆయన ఉపదేశం ఇలా ఉంది:

సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు.
(దివ్య ఖుర్‌ఆన్ 2: 153)

ఈ వాక్యం మనిషికి అల్లాహ్ మద్దతు ఓర్పు రూపంలో లభిస్తుం దని చెబుతుంది. ఈ ప్రపంచంలో మనకు అల్లాహ్ మద్దతు అవసరమైన అనేక సందర్భాలు ఉన్నాయి. ఈ వాక్యంలో ఒక మానసిక అంశం కూడా ఉంది. ఓర్పు వహించే వ్యక్తికి మొదటి దశలోనే ఒక మానసిక ఆధిక్యత లభిస్తుంది. అదేంటంటే, కష్టాలను, సమస్యలను చూసి అధైర్యపడకుండా, భయపడ కుండా, అతను వాటిని ధైర్యంగా ఎదుర్కొంటాడు. ఓర్పు అనేది ఒక వ్యక్తి ఒకే సమయంలో రెండు పనులు చేసే చర్య. ఒకటి కష్టాన్ని భరించడం, మరొకటి చెడు చర్య నుండి దూరంగా ఉ ండటం. ఈ విషయం మనిషికి రెండు రెట్ల బహుమతికి అర్హుడిని చేస్తుంది.

## హదీసులలో ఆత్మహత్య నిషేధం


అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స) ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని రెండు రెట్ల శిక్షకు అర్హుడిగా ప్రకటించారు. హజ్రత్ అబూ హురైరా(ర) ఇలా అన్నారు:

"ఎవరైతే పర్వతం నుండి దూకి తనను తాను చంపుకుంటాడో, అతను నరకానికి వెళ్తాడు, ఎల్లప్పుడూ అందులో పడుతూనే ఉంటాడు, ఎప్పటికీ అక్కడే ఉంటాడు. ఎవరైతే విషం తాగి తన జీవితాన్ని ముగించుకుంటారో, ఆ విషం నరకంలో కూడా అతని చేతిలో ఉంటుంది. దాన్ని అతను నిరంతరం తాగుతూనే ఉంటాడు. అతడు ఎప్పటికీ అక్కడే ఉంటాడు. ఎవరైతే తనను తాను ఇనుప ఆయుధంతో చంపుకుంటారో, ఆ ఆయుధం అతని చేతిలో ఉంటుంది, దాన్ని అతను తన కడుపులో పొడుచు కుంటూనే ఉంటాడు, అతడు ఎప్పటికీ నరకంలోనే ఉంటాడు."
(బుఖారీ)

"ఎవరైతే ఏ వస్తువుతో ఆత్మహత్య చేసుకుంటారో, అతనికి నరకంలో అదే వస్తువుతో శిక్ష విధించబడుతుంది." (బుఖారీ)

"ప్రవక్త (స) ముందుకు ఒక వ్యక్తిని తీసుకొచ్చారు, అతను తనను తాను ఒక ఈటెతో చంపుకున్నాడు. ఆయన(స) అతని అంత్య క్రియల (జనాజా) నమాజ్ చేయలేదు." (అబూ దావూద్, కితాబ్ అల్-జనాయిజ్ బాబ్ తర్క్ అస్-సలాహ్ అలా మన్ ఖాతిల్ నఫ్సహు)

ఈ విషయాలన్నింటినీ బట్టి మనిషికి ఎన్ని కష్టాలు వచ్చినా, ఇస్లాం అతనికి ఆత్మహత్యకు అనుమతి ఇవ్వదని, బదులుగా ఓర్పు వహించమని బోధిస్తుందని తెలుస్తుంది. ఇలా ఓర్పు వహించిన వారికి అల్లాహ్ నుండి ప్రతిఫలం ఉంటుందన్న వాగ్దానం ఉంది.



# ప్రమాణం ప్రణామం

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి**

### 5) అల్లాహ్ పేరిట చేసిన ప్రమాణాన్ని గౌరవించాలి, ప్రమాణం చేసిన వ్యక్తిని నమ్మాలి

అలా చేయడం అల్లాహ్ పట్ల ప్రేమ, గౌరవానికి ప్రబల తార్కాణం. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "ఎవరైనా అల్లాహ్ పేరిట ప్రమాణం చేస్తే, అతను నిజమే చెప్పాలి. ఎవరైనా అతని కోసం అల్లాహ్ పేరిట ప్రమాణం చేస్తే, అతడు దానితో సంతృప్తి చెందాలి. ఎవరైనా అల్లాహ్ పేరిట ప్రమాణాన్ని తక్కువగా భావిస్తే, అతడు అల్లాహ్‌కు చెందినవాడు కాడు." (ఇబ్ను మాజా)

ఈ కారణంగా ప్రవక్తలు, సద్గుణ సంపన్నులు, సుభక్తాగ్రేసరులు, మన సజ్జన పూర్వీకులు అల్లాహ్ పేరు మీద ప్రమాణం చేయడాన్ని చాలా గౌరవంగా భావించేవారు. ప్రవక్త ముహమ్మద్(స) ఒక ఉదాహరణ చెప్పారు: దైవప్రవక్త ఈసా బిన్ మర్యం (అలైహిస్సలామ్) ఒక మనిషిని దొంగతనం చేస్తూ చూశారు. ఈసా (అ) అతనిని అడిగారు: "నీవు దొంగతనం చేశావా?" అతడు అల్లాహ్ పేరిట ప్రమాణం చేస్తూ అన్నాడు: నన్ను సృష్టించిన నిజ ఆరాధ్యుడయిన అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నా "లేదు, నేను దొంగిలించ లేదు". అది విన్న ఈసా(అ) వినయంగా అల్లాహ్ యెడల గౌరవంతో ఇలా అన్నారు: "నేను అల్లాహ్‌ను నమ్ముతున్నాను, నా కళ్ళే అబద్ధమాడాయి అని భావిస్తున్నాను." (బుఖారీ)

### 6) ఒట్టుకి కట్టుబడి ఉండాలి

ప్రమాణం చేస్తే, వారు తమ మాటకు కట్టుబడి ఉండాలి. ఒకరు ఏదైనా పని చేస్తానని ప్రమాణం చేస్తే, తప్పకుండా ఆ పని చేయాలి. అలాగే, ఏదైనా పని చేయనని ప్రమాణం చేస్తే, అది చేయకూడదు, అది పాపపు పని కాకపోతే. ఎందుకంటే పాపపు విషయాల్లో ప్రమాణాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం లేదు.

### 7) నిషిద్ధమైన విషయంపై ప్రమాణం చేయకూడదు:

హరామైన (నిషిద్ధమైన) పనిని చేస్తానని ప్రమాణం చేయడం నిషిద్ధం. ప్రవక్త ముహమ్మద్(స) ఇలా చెప్పారు: "ఎవడైనా బంధుత్వాన్ని తెంచే విషయం మీద, లేదా అసత్యం / అసంబంధమైన విషయంపై ప్రమాణం చేస్తే, అతను ఆ పనిని పూర్తి చేయకపోవడమే అతనికి మంచిది." (ఇబ్ను మాజహ్)

### 8) ప్రమాణంలో మినహాయింపు (అంటే "ఇన్ షా అల్లాహ్" అని చెప్పడం):

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) కథనం: ప్రవక్త (స) ప్రవచనం, "ప్రమాణం చేసేటప్పుడు "ఇన్‌షా అల్లాహ్" అని పలికితే, అతని ప్రమాణం భంగం కాదు. (తిర్మిజి)

ఒక వ్యక్తి ఏదైనా విషయంపై అల్లాహ్ పేరుతో ప్రతిజ్ఞ చేస్తూ, "ఇన్‌షా అల్లాహ్"అంటే అల్లాహ్ చిత్తమైతే అని చెప్పడం వలన, అతను తన ప్రతిజ్ఞను నెరవేర్చలేకపోయినప్పటికీ పాపం చేయని

వాడవుతాడు. ఈ మినహాయింపు వల్ల ప్రయోజనం ఏమిటంటే- తన చేతుల్లో లేని పరిస్థితుల వల్ల తన వాగ్దానాన్ని నెరవేర్చ లేనప్పుడు, అది పాపంగా పరిగణించబడదు.

కానీ ఈ మాట "ఇన్‌షా అల్లాహ్" అనడం వలన, ఎవ్వరూ కూడా మనసులోనైనా ముందుగానే వాగ్దానాన్ని ఉల్లంఘించాలన్న ఉద్దేశంతో ఉండకూడదు. అలా ముందే అనుకోవడం కపట లక్షణం. అల్లాహ్ మనల్ని కాపాడుగాక! ఇన్‌షా అల్లాహ్ వెనక ఉద్దేశ్యం -

ఈ స్థితిలో ఉద్దేశం ఏంటంటే- జాగ్రత్తగా ఉండటం, ప్రతిజ్ఞ చేసిన తర్వాత మారిపోయే పరిస్థితుల్లో పాపం ఊబిలో పడకుండా ఉండటమే. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: "ఎవరు అయినా ప్రతిజ్ఞ చేసేటప్పుడు ఇన్ షా అల్లాహ్ అంటే- ఒకవేళ అతనికి ఇష్టం అయితే ఆ వాగ్దానాన్ని నెరవేర్చ వచ్చు, లేదా విడిచిపెట్టవచ్చు- కానీ అతనికి పాపం ముట్టదు. (సహీహ్ అబూ దావూద్)

## 9) ప్రమాణం, ప్రమాణం చేయించే వారి సంకల్పంపై ఆధారపడి ఉంటుంది

ప్రమాణం చేసే వ్యక్తి తన మనసులో ఒక ఉద్దేశం పెట్టుకుని, మాటలతో మాత్రం వేరే అర్థం వచ్చేలా మాట్లాడటం శాస్త్రపరంగా తప్పు. ఉదాహరణకు: ఒకడు "నేను ఇది చేయలేదు" అని ప్రమాణం చేస్తాడు, కానీ అతని ఉద్దేశం "నేడు చేయలేదు" అనే అర్థంలో ఉంటుంది, అసలు విషయం ఏమిటంటే అతను అది నిన్ననే చేసేశాడు. ఇలాంటి డొంక తిరుగుడు మాటలు చెప్పడం తగదు.

ఇస్లాం ధర్మంలో ప్రమాణం చేయమంటున్న వ్యక్తి ఉద్దేశాను సారమే చెల్లుతుంది, ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "నీ ప్రమాణం, అది నమ్ముతున్న వ్యక్తి ఎలా అర్థం చేసుకుంటాడో దానిపైనే ఆధారపడి ఉంటుంది." (ముస్లిం) మరొక హదీసులో: "ప్రమాణం, ప్రమాణం చేయమంటున్నవాడి ఉద్దేశంపైనే ఆధారపడి ఉంటుంది." (ముస్లిం)

అంటే, ప్రమాణం చేసే వాడి మాటలు కాకుండా, ప్రమాణం వినే వాడి ఉద్దేశం ప్రకారం దాని అర్థం నిర్ణయించబడుతుంది. ఈ విధంగా తిరకాసు మాటలు చెప్పడం వల్ల, ప్రజల్లో ప్రమాణాల పట్ల నమ్మకం పోతుంది, ఎవరు ప్రమాణం చేసినా అది నమ్మశక్యం కాని విషయంగా మారిపోతుంది. ఇది సంఘ విశ్వాసాన్ని నాశనం చేస్తుంది, ఇది ఒక పెద్ద అపవాదం, భయంకర దోషం, తీవ్ర ద్రోహం.

## ప్రమాణ మర్యాదలు

**1) ఒట్టుని నిలబెట్టుకోవడం:** బరా ఇబ్న్ ఆజిబ్ (ర) చెప్పారు: "ప్రవక్త ముహమ్మద్ (స) మమ్మల్ని ఏడు విషయాల గురించి ఆజ్ఞాపించారు." ఆ ఆజ్ఞలలో ఒకటి: "ఇబ్రారుల్ ముక్సిమ్"- అంటే: "ఒక ముస్లిం సహోదరుడు ఒట్టు తీసుకుంటే, అది మంచి విషయమైనట్లయితే, అతని ఒట్టును గౌరవించండి, అతనిని ఒట్టు తప్పేలా చేయకండి." (సహీహ్ బుఖారీ)

ఈ హదీసు- ముస్లింల మధ్య ప్రేమ, గౌరవం, సహకారం ఉండాలని తేల్చి చెబుతుంది. ఒక ముస్లిం తన సహోదరుని కోసం-"అల్లాహ్ మీద ఒట్టు!" అని చెబితే, మనం అతని మాటను పట్టించుకోవాలి, అతను కోరిన సహాయాన్ని చేయ గలిగితే తప్పకుండా చేయాలి.

కానీ- ఆ ఒట్టు పాపానికి సంబంధించినదయి, అల్లాహ్ అవిధేయతతో కూడినదయి ఉన్నట్లయితే, అప్పుడు దాన్ని గౌరవించాల్సిన, పరిగణనలోకి తీసుకోవాల్సిన, పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు: "నీవు ఈ దొంగతనంలో నాకు సహాయం చేయకపోతే, అల్లాహ్ మీద ఒట్టు!"- అని అంటే, ఆ ఒట్టును గౌరవించరాదు, ఎందుకంటే అది పాపం.

**2) ప్రమాణ భంగానికి పరిహారం, మెరుగైనదాన్ని చేపట్టడం:** అబూ మూసా (ర) కథనం: ప్రవక్త(స) ప్రవచనం, "అల్లాహ్ సాక్షి! అల్లాహ్ కోరితే, ఒకవేళ నేను- ఏదైనా పని చేయాలని ప్రమాణం చేసిన తరువాత అందులో కాక ఇతర దానిలో అంతకంటే మంచిని చూస్తే, నేను నా ప్రమాణానికి పరిహారం చెల్లించి, అంతకంటే మంచి పనిని చేస్తాను." (బుఖారీ, ముస్లిమ్)

'అబ్దుర్రహ్మాన్ బిన్ సమురహ్ (ర) కథనం: ప్రవక్త (స) ప్రవచనం, "ఓ 'అబ్దుర్రహ్మాన్! నువ్వు నాయకుడు కావాలని దరఖాస్తు చేయకూడదు. ఎందుకంటే ఒకవేళ దరఖాస్తు చేయడం వల్ల, నీ కోరిక వల్ల నాయకుడిగా చేయబడితే, నిన్ను నాయకత్వానికే గురి చేయడం జరుగుతుంది. ఇంకా అల్లాహ్(త) సహాయం నీ నుండి ఎత్తుకోబడుతుంది. ఒక వేళ నువ్వు కోరకుండా, దరఖాస్తు చేయకుండా నువ్వు నాయకుడివైతే, నీకు సహాయం చేయడం జరుగుతుంది. నీపై అల్లాహ్(త) దయ ఉంటుంది. నువ్వు ఏ విషయంలోనైనా ప్రమాణం చేస్తే, దానికి వ్యతిరేకంగా చేయడంలో లాభం ఉంటే, నీవు నీ ప్రమాణానికి పరిహారం చెల్లించు. నీకు లాభం ఉన్నదాన్ని చేయి." మరో ఉల్లేఖనంలో "నువ్వు ఆ మంచి పనిని చేయి, నీ ప్రమాణానికి పరిహారం చెల్లించు".

(బుఖారీ, ముస్లిమ్)

ఈ 'హదీసు' ద్వారా ప్రమాణం భంగపరచక ముందు కూడా పరిహారం చెల్లించడం ధర్మసమ్మతమేనని, ప్రమాణం భంగపరచిన తరువాత అయితే పరిహారం తప్పని సరిగా ఇవ్వాలని తెలిసింది.

అబూ హురైరహ్ (ర) కథనం: ప్రవక్త (స) ప్రవచనం, ఒక వ్యక్తి ఒక విషయంపై ప్రమాణం చేసి, దానికి వ్యతిరేకంగా లాభం ఉందని అనిపిస్తే, అతడు తన ప్రమాణానికి పరిహారం చెల్లించాలి, లాభం ఉన్న పని చేయాలి. (ముస్లిమ్)

**3) అన్యాయ ప్రమాణం చేయకూడదు**: అబూ హురైరహ్ (ర) కథనం: ప్రవక్త(స) ప్రవచనం, "అల్లాహ్ సాక్షి! మీలో ఎవరైనా తన భార్యాబిడ్డల పట్ల అన్యాయం చేస్తానని ప్రమాణం చేసి, ప్రమాణ భంగం చేసి పరిహారం చెల్లించడమే ఉత్తమమని తెలిసి కూడా, తన ప్రమాణంపైనే పట్టు వదలకుండా ఉంటే, అతనికి అతనిపై విధించిన ఆ పరిహారం చెల్లించడం కన్నా ఎక్కువ పాపం చుట్టు కుంటుంది. (ఎందుకంటే పరిహారం వల్ల పాపం తొలగిపోతుంది, కాని ఇక్కడ మంకుపట్టు వదలక పోవడం ప్రమాణం భంగం చేయడం కన్నా ఘోరమైన పాపం). (బుఖారీ, ముస్లిమ్)

**4) ధర్మ విరుద్ధ ప్రమాణం చేయకూడదు** : సాబిత్ బిన్ 'ద'హ్హాక్(ర) కథనం: ప్రవక్త(స) ప్రవచనాలకు, ఇస్లామ్‌కు వ్యతిరేకంగా మరో ధర్మంపై అసత్య ప్రమాణం చేసేవాడు అతను అన్నట్లే అయి పోతాడు. అంటే, 'ఒకవేళ నేను అలాచేస్తే యూదుణ్ణి, క్రైస్తవుణ్ని లేదా హిందువును,' అని అంటే అతడు ఆ విధంగానే అయిపోయి నట్లు. అదేవిధంగా తన అధీనంలో లేని దాని గురించి మొక్కు కుంటే, ఆ మొక్కుబడి సరికాదు. అదేవిధంగా ఇహలోకంలో ఎవరైనా ఏ వస్తువుతోనైనా తన్నుతాను చంపుకుంటే తీర్పుదినం నాడు అతన్ని దాని ద్వారానే శిక్షించడం జరుగుతుంది. అదేవిధంగా ఎవరైనా ఒక ముస్లిమ్‌ను శపిస్తే, దాని పాపం అతన్ని చంపడంతో సమానం. అదేవిధంగా ఎవరైనా మరో ముస్లిమ్‌పై అవిశ్వాస నిందవేస్తే అతన్ని చంపినట్టే. అంటే శపించేవాడు, నిందవేసేవాడు, విశ్వాసిని చంపినవాడితో సమానం. అదేవిధంగా మరొకరి ధనాన్ని దోచుకోవటానికి అసత్యవాదన చేసి తన ధనం పెరుగుతుందని భావిస్తే, అల్లాహ్ అతని ధనాన్ని తరిగిస్తాడు, తగ్గిస్తాడు." (బుఖారీ, ముస్లిమ్)

బురైదహ్ (ర) కథనం: ప్రవక్త (స) ప్రవచనం, "ఒకవేళ ఎవరైనా నేను ఇలా చేస్తే, నేను ఇస్లామ్ పట్ల విసిగిపోయినట్లే అని ప్రమాణం చేస్తే, ఒకవేళ అతడు అసత్య ప్రమాణం చేస్తే అన్నట్టు అయిపోతాడు, అంటే అతడు ఇస్లామ్ పట్ల విసుగు చెందుతాడు. ఒకవేళ అతడు సత్య ప్రమాణం చేసినా ఇస్లామ్ వైపు సురక్షితంగా రాలేడు. (అబూ దావూద్, నసాయి', ఇబ్నె మాజహ్)

**5) ప్రమాణ భంగం జరిగితే పరిహారం చెల్లించాలి** : (బుద్ధిపూర్వ కంగా ఏదైనా తప్పుడు ప్రమాణం చేసివుంటే) దానికి నిష్కృతి-మీరు మీ భార్యాపిల్లలకు పెట్టేటటువంటి సగటురకం భోజనం పది మంది పేదలకు పెట్టాలి, లేదా బట్టలివ్వాలి, లేదా ఒక బానిసకు స్వేచ్ఛనివ్వాలి. ఇవేవీ లేనివారు మూడు రోజులు ఉపవాసం పాటించాలి. మీరు ప్రమాణం చేసి భంగపరిస్తే దానికిదే నిష్కృతి. అందుచేత మీ ప్రమాణాలను కాపాడుకోండి. మీరు అల్లాహ్ పట్ల కృతజ్ఞులై ఉండేందుకు ఈ విధంగా ఆయన తన ఆజ్ఞలు మీకు విడమరచి బోధిస్తున్నాడు.

(అల్-మాయిదహ్: 89)

ఈ ఆయతులో పేర్కొనబడిన దాన్ని క్రమం తప్పకుండా పాటించాలి. 1) పది మందికి అన్నదానం. 2) పది మందికి వస్త్ర దానం. 3) బానిసను బంధ విముక్తి చేయడం. 4) మూడ్రోజులు ఉపవాసం.

**6) ప్రతి విషయానికి ఒట్టు వేయకూడదు** : ముస్లిం తన నోటిని అదుపులో పెట్టుకోవాలి. ప్రతి చిన్న విషయానికీ, పెద్ద విషయానికీ, తేలికపాటి విషయానికీ, బరువైన విషయానికీ ఒట్టు వేయడం అలవాటు చేసుకోకూడదు. ఇది అల్లాహ్ పేరును తక్కువ చేసినట్లవుతుంది. చాలామంది ప్రతి విషయానికి ఒట్టు వేయకుండా మాట్లాడలేరు. ఇది ఎంత మాత్రం సమంజసమయిన విషయం కాదు. అవసరమైనప్పుడే ఒట్టు వేయాలి.

**7) ఒట్టు వేసి వస్తువులను అమ్మకూడదు** : దైవప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు: "ముగ్గురు వ్యక్తులతో అల్లాహ్ మాట్లాడడు, వారి వంక కన్నెత్తి కూడా చూడడు. వారిని పరిశుద్ధుల్ని చేయడు. పైగా వారి కొరకు వ్యధాభరితమయిన శిక్ష సిద్ధంగా ఉంటుంది. వారిలో ఒకడు అబద్ధపు ప్రమాణాలు చేసి తన సరకును అమ్మేవాడు" (సహీహ్ ముస్లిం)

**8) ఒట్టు వేయడంలో ప్రవక్త (స) వారి సంప్రదాయం** : వల్లాహి, తల్లాహి, బిల్లాహి అన్నవి అరబీలో అల్లాహ్ మీద ఒట్టుకి ఉపయోగించే ప్రమాణ పదాలు. అబూ సయీద్ 'ఖుద్రీ (ర)

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

కథనం: ప్రవక్త (స) ప్రమాణం చేయటాన్ని తప్పనిసరిగా భావిస్తే ఇలా అంటారు, "ఎవరి చేతిలో అబుల్ ఖాసిమ్ ప్రాణం ఉందో ఆయన (త) సాక్షి! ఈ విషయం ఇలా లేదు." (అబూ దావూద్)

**9) మంచి చేయబోనని ఒట్టు వేయకూడదు** : మంచికి, దైవభీతికి, ప్రజల మధ్య రాజీ కుదర్చడానికి సంబంధించిన పనులు మానుకునే విషయంలో మీరు ప్రమాణం చేయవలసివస్తే, అలాంటి పనులను గురించి దేవుని పేరుతో ప్రమాణం చేయకండి. అల్లాహ్ అన్నీ వింటున్నాడు. ఆయనకు సమస్త విషయాలు తెలుసు. మీరు అనాలోచితంగా, ఆషామాషిగా చేసే అర్థం పర్థం లేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని ప్రశ్నించడు. మీరు మనస్ఫూర్తిగా కావాలని చేసే ప్రమాణాలను గురించే ఆయన మిమ్మల్ని నిలదీస్తాడు. (జరిగిందేదో జరిగింది) దేవుడు ఎంతో క్షమాశీలి, అపార కృపాశీలుడు.

(బఖర - 224-225)

అబూ అహ్వస్ 'ఔఫ్ బిన్ మాలిక్ తన తండ్రి మాలిక్ ద్వారా కథనం: అతని తండ్రి కథనం: "ఓ అల్లాహ్ ప్రవక్తా! నాకేదైనా అవసరం వచ్చి, నేను నా చిన్న కొడుకు దగ్గరకు వెళితే, అతడు నాకు సహాయం చేయడు, బంధుత్వ విధినీ చెల్లించడు, నా పట్ల మంచితనంతో వ్యవహరించడు. అదేవిధంగా అతనికి అవసరం ఉండి, నా దగ్గరకు వస్తే, నేను అతనికి సహాయం చేయనని, అతని పట్ల బంధుప్రీతితో వ్యవహరించనని నేను ప్రమాణం చేసుకున్నాను" అని అన్నాను. దానికి ప్రవక్త (స), "నువ్వు మంచి పనులు చేస్తూ ఉండు. నీ ప్రమాణానికి తగిన పరిహారం చెల్లించివేయి" అని అన్నారు. (నసాయి, ఇబ్నె మాజహ్)

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: నేను, "ఓ అల్లాహ్ ప్రవక్తా! మా చిన్నాన్న కొడుకు అవసరార్థం నా దగ్గరకు వస్తాడు, అయితే నేను అతనికి సహాయం చేయనని, మంచిగా ప్రవర్తించనని ప్రమాణం చేసి ఉన్నాను" అని విన్నవించుకున్నాను. దానికి ప్రవక్త (స), "నీవు నీ ప్రమాణానికి పరిహారం చెల్లించు, మంచి పనులు చేస్తూ ఉండు" అని హితబోధ చేసారు.

**10) అమానతుల మీద ఒట్టు వేయరాదు** : బురైదహ్ (ర) కథనం: ప్రవక్త(స) ప్రవచనం, "అమానతుపై ప్రమాణం చేసిన వారు మాలోని వారు కారు." (అబూ దావూద్) ఎందుకంటే అమానతు కూడా దైవ సృష్టితాలలోనిదే.

ప్రణామం ముఖ్యంగా పెద్దలు, ఉపాధ్యాయులు, దేవుళ్ళకు లేదా ఎవరినైనా గౌరవంగా చూపేటప్పుడు ఈ పదాన్ని ఉపయోగిస్తారు. "ప్రణామం" లో. "ప్ర" అంటే "ముందు" లేదా "ఎక్కువ" అని, "ఆనమ" అంటే "వంగడం" లేదా "వంచుకోవడం" అని అర్థం. కాబట్టి, "ప్రణామం" అంటే "ముందుగా వంగి నమస్కరించడం" లేదా "గౌరవంగా వంగి నమస్కరించడం" అని భావం.

## నిలబడటం, ఒంగటం

అల్లాహ్ కోసం కాకుండా ఇతరుల కోసం నిలబడడం నాలుగు రకాలుగా ఉంటుంది:

**1) ఒకరు రాగానే భయంతో నిలబడటం:** ఇది గౌరవం కోసం నిలబడడమే అయినా, ఇది అనుమతించబడదు. ఇది కుఫ్ర్ (అవిశ్వాసం) కాదు, కానీ గర్హనీయమే.

**2) సమాధి, విగ్రహం, చెట్టు లేదా రాయికి పూజార్థం నిలబడటం:** (వందనం, నమస్కారం వంటివి): ఇది పూజగా మారుతుంది. ఇది అనుమతించబడదు, అంతేకాకుండా ఇది పెద్ద షిర్క్ అవుతుంది.


**3) గౌరవంగా నిలబడటం** : ఎవరైనా మనం ఉండే ప్రదేశంలోకి ప్రవేశించినప్పుడు (ఉదాహరణకు ఉపాధ్యాయులు, లేదా అధికారులు వచ్చినప్పుడు): ఇది మంచి పద్ధతి కాదు, కానీ కొందరు చేయడం చూస్తాం. ఇది మక్రూహ్ (అవాంఛనీయమైన పని).

హజ్రత్ అనస్ (ర) చెబుతున్నారు: "ప్రవక్త ముహమ్మద్ (స) మాకు అత్యంత ప్రియమైనవారు. అయినా ఆయన మా దగ్గరికి వచ్చినప్పుడు మేము ఆయన కోసం నిలబడేవారము కాము, ఎందుకంటే ఆయనకు అది ఇష్టం ఉండేది కాదు." ఇది కొన్ని సందర్భాల్లో నిషిద్ధం (హరామ్)గా, మరికొన్ని సందర్భాల్లో తగదని (మక్రూహ్)గా భావించబడుతుంది. అయితే సలఫ్ దృష్టిలో ఇది చాలా సందర్భాల్లో హరామ్‌గానే పరిగణించబడింది.

4) ఒక అతిథి వచ్చేటప్పుడు అతనిని గౌరవంగా పలకరించేందుకు లేచి అభివాదం చేయడం, చేతి మీద చేయి వేసి స్వాగతించడం: ఇది పరస్పర గౌరవానికి అవసరమయినది. ఇందులో తప్పు లేదు, అభిలషణీయమే.

## చివరి మాట

సమస్య తీవ్రత, మనం చూసే దృక్పథాన్ని బట్టి ఉంటుంది. ఫలితం ప్రభావం, మనం చేసే ప్రయత్నాన్ని బట్టి ఉంటుంది. సమయానికి ఉన్న విలువ, సద్వినియోగం చేసుకునే నైపుణ్యాన్ని బట్టి ఉంటుంది. ఏది ఏదైనా సానుకూల దృక్పథం కలిగిన వారు అన్ని వేళలా రాణిస్తారు. ప్రతి సృష్టి చిత్రం ప్రమోదం అమోఘం. నువ్వెంత నేనెంత రవ్వంత, ఎన్నో ఏళ్ళది ఈ సృష్టి వింత. అనుభవమే దాచింది కొండంత. ప్రకృతి ధర్మం అయిన ఇస్లాం చూపిన ఆదర్శ అడుగుల్లో అడుగేసి సాగిపోదాం జీవితమంతా.



# ఖుర్‌ఆన్ దార్శనికత

- యం.డి. సుహైల్

**ఒకానొక** చిన్న గ్రామంలో జ్ఞానంపై ఎంతో ఆసక్తి కలిగిన ఓ విద్యార్థి ఉండేవాడు. పుస్తకాలు చదివి, గణితం, సైన్సు నేర్చుకుని అందరిలో తెలివైన వాడిగా పేరుగాంచాడు. ఒకరోజు ఆయన గురువు "నీకు జ్ఞానం అంటే ఏమనిపిస్తోంది?" అని అడిగాడు. విద్యార్థి వెంటనే "ఎక్కువ పుస్తకాలు చదవడం, ఎక్కువ విషయాలు తెలుసుకోవడం గురువుగారూ" అన్నాడు. గురువు చిరునవ్వు చిందిస్తూ, గ్రామం చుట్టూ తీసుకెళ్లాడు. వాన చినుకులు మేఘాల నుండి పడుతుండగా ఆయన "ఈ వర్షపు చక్రాన్ని ఎవరు సృష్టించారు? ఒకే నీటితో పలు రకాల పండ్లు పుట్టడం వెనుక ఎవరి శక్తి ఉంది? పర్వతాల వైవిధ్యం, మనిషి పుట్టుక ఎలా జరిగింది?" విద్యార్థి ఆశ్చర్యంగా చూశాడు. గురువు మెల్లగా ఖురాన్ వాక్యాన్ని చదివారు: "అల్లాహ్ దాసులలో జ్ఞానం గలవారే ఆయనకు భయపడతారు." అప్పుడే విద్యార్థి గ్రహించాడు నిజమైన జ్ఞానం అనేది కేవలం చదువు కాదు, సృష్టి వెనుక సృష్టికర్తను గుర్తించడం. ఆ గుర్తింపు కలిగినవారికే దైవ భీతి పుడుతుంది అని.

★★★

జ్ఞానం మనిషి జీవితానికి వెలుగునిస్తుంది. కానీ ఆ వెలుగు కేవలం అక్షర జ్ఞానం లేదా సాంకేతిక పరిజ్ఞానంతో మాత్రమే పూర్తి కాదు. నిజమైన జ్ఞానం అనేది మనిషిని తన సృష్టికర్త వైపు మళ్లించే శక్తి. ఖురాన్ స్పష్టంగా చెబుతుంది: "అల్లాహ్ యొక్క దాసులలో జ్ఞానం గలవారే ఆయనకు భయపడతారు." ఈ వాక్యం మన ముందుంచే సందేశం అత్యంత లోతైనది. వర్షపు చక్రం నుంచి పర్వతాల వైవిధ్యం వరకు, పూల సౌందర్యం నుంచి మానవ శరీరంలోని అద్భుత రహస్యాల వరకు ప్రకృతి ప్రతీ మూలకమూ మనకు ఒకే పాఠాన్ని చెబుతోంది: సృష్టి వెనుక ఒక పరమ శక్తి ఉంది. ఆ శక్తిని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం, ఆ జ్ఞానం కలిగినవారికే నిజమైన దైవ భీతి కలుగుతుంది.

"అల్లాహ్ యొక్క దాసులలో జ్ఞానం ఉన్నవారు మాత్రమే ఆయనకు భయపడతారు." ఈ జ్ఞానం అంటే ఏమిటి? దానిని ఎలా పొందాలి? మరో మాటలో చెప్పాలంటే, దైవ భీతిని పెంచే జ్ఞాన శాఖలు ఏవి?

ఈ విషయాలను అర్థం చేసుకోవడానికి, ఈ వాక్యం చెప్పబడిన ఖురాన్ ఆయత్‌ల సందర్భాన్ని పరిశీలించాలి. ఖురాన్ లోని ఆ రెండు ఆయత్‌ల అనువాదం ఇలా ఉంది:

> **ఆకాశం నుండి అల్లాహ్ వర్షం కురిపించటాన్ని నీవు చూడటం లేదా? తరువాత దాని ద్వారా మేము రకరకాల రంగు రంగుల పండ్లను ఉత్పత్తి చేస్తాము. కొండలలో కూడా తెల్లని, ఎఱ్ఱని, కారునలుపు చారలు కనిపిస్తాయి, వాటి రంగులు వేర్వేరుగా ఉంటాయి. ఈ విధంగానే మానవుల, జంతువుల, పశువుల రంగులు కూడా భిన్నమైనవే. యథార్థమేమిటంటే, అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు. నిస్సందేహంగా అల్లాహ్ శక్తిమంతుడు, మన్నించేవాడూను. (ఫాతిర్ 35: 27-28).**

ఈ ఆయత్‌లను పరిశీలిస్తే, ఇక్కడ జ్ఞానం అంటే అల్లాహ్, ఆయన శక్తి, ఆయన సృజనాత్మక గొప్పతనం, ఆయన

విస్మయపరిచే కళాఖండాల గురించి తెలుసుకోవడం అని అర్థమవుతుంది. ఈ జ్ఞానాన్ని పొందడానికి, ఖురాన్ కొన్ని విషయాల వైపు మనిషి దృష్టిని మళ్లించింది. వాటిలో మొదటిది; వర్షపు వ్యవస్థ. ఖురాన్ మనిషిని వర్షపు వ్యవస్థ గురించి ఆలోచించమని మరియు దాని వెనుక ఉన్న అల్లాహ్ శక్తిని అర్థం చేసుకోమని ప్రోత్సహించింది. ఇది పూర్తిగా సైన్స్, ముఖ్యంగా భౌగోళిక శాస్త్రం, పర్యావరణ శాస్త్రం మరియు వాతావరణ శాస్త్రం (Meteorology)కి సంబంధించిన జ్ఞానం. మొత్తం జల చక్రాన్ని (Water Cycle) లోతుగా పరిశీలిస్తే, ప్రకృతి వ్యవస్థ యొక్క గొప్పతనాన్ని అంగీకరించకుండా ఉండలేము. నీరు సముద్రాల నుండి ఆవిరి రూపంలో ఎలా పైకి వెళ్తుంది, ఘనీభవనం (Condensation) ద్వారా మేఘాలుగా ఎలా మారుతుంది, ఆపై గాలి ఆ మేఘాలను దూరంగా ఉన్న పర్వతాలు, మైదానాలు, నదులు, సముద్రాలపైకి తీసుకువెళ్లి వర్షం కురిసేలా చేస్తుంది. నదులు, సముద్రాలతో పాటు భూమిలోకి ఇంకి (Percolation) భూగర్భ జల మట్టం ఎలా నిలిచి ఉంటుంది, మనం ఎక్కడ కావాలంటే అక్కడ బావుల ద్వారా, బోర్ వెల్స్ ద్వారా స్వచ్ఛమైన నీటిని ఎలా పొందుతున్నాము, భారీ మొత్తంలో స్వచ్ఛమైన నీరు మంచు రూపంలో పర్వతాలపై కూడా నిల్వ చేయబడుతుంది, అది నెమ్మదిగా కరిగి నదులు, సముద్రాలకు జీవం పోస్తుంది మరియు భూగర్భ జల ధమనుల (Water Veins) ద్వారా కూడా దూరంగా ఉన్న మైదానాలకు చేరుతుంది. ఏ ప్రభుత్వమూ ఇంత పెద్ద మొత్తంలో సముద్రపు నీటిని పూర్తిగా శుద్ధి చేసి పర్వతాలపై నిల్వ చేయడం లేదా మైదానాలకు చేరవేయడం, లేదా భూమి లోపల నీటి మట్టాన్ని నిర్వహించడం వంటివి చేయలేదు, ఇవన్నీ ప్రకృతి ప్రణాళికలో భాగంగా స్వయంచాలకంగా జరుగుతున్నాయి.

ఈ వర్షపు నీరు వివిధ మార్గాల ద్వారా ఎండిపోయిన భూములకు చేరినప్పుడు, అక్కడ చెట్లు, మొక్కలు, పూలు, పండ్లతో పచ్చగా కళకళలాడుతాయి. ఒకే భూమి, ఒకే రకమైన నీటితో తడిసినప్పటికీ, దానిలో వివిధ రంగులు, రకాల పూలు, పండ్లు పుడతాయి, వాటి సువాసన, రుచి కూడా భిన్నంగా ఉంటాయి. ఇదంతా మనిషి తనంతట తానుగా జరుగుతుందని అనుకుంటాడా? కాదు! దీని వెనుక అల్లాహ్ శక్తి పనిచేస్తుంది, దీనిని కొద్దిగా లోతుగా ఆలోచిస్తే అర్థం చేసుకోవచ్చు. దీని గురించి ఆలోచిస్తే, ఈ జ్ఞానం వృక్షశాస్త్రం (Botany), వ్యవసాయం (Agriculture)కి సంబంధించినది.

మూడవ విషయం, పర్వతాల నిర్మాణం మరియు వాటి రంగులలో కనిపించే వైవిధ్యం. ఇది భౌగోళిక శాస్త్రం, భూమి శాస్త్రం (Earth Science), భూగర్భ శాస్త్రం (Geology) యొక్క అంశం. కొన్ని పర్వతాలు తెల్లగా, కొన్ని ఎర్రగా, మరికొన్ని చాలా ముదురు నల్లగా ఉంటాయి. అదే విధంగా, కొన్ని పర్వతాలు పూర్తిగా ఎండిపోయి, నిస్సారంగా ఉంటాయి, మరికొన్ని చెట్లు, మొక్కలు, అడవులతో పచ్చగా ఉంటాయి. ఆ పర్వతాల నుండి ఎన్ని రకాల జీవ సంబంధ సహజ వనరులు లభిస్తాయో కూడా ఆలోచించండి. వాటిని పర్వతాలలో ఎవరు సృష్టించారు? ఇవి కూడా అల్లాహ్ శక్తి, కళాఖండాలకు నిదర్శనాలే కదా!

నాలుగవ విషయం, మనిషి స్వంత రూపం, జంతువులు, పశువుల నిర్మాణం, వాటి రంగు, రూపం. వాటిలో చాలా వైవిధ్యం (Diversity), సంక్లిష్టత (Complexity) ఉంది, వాటి గురించి ఆలోచిస్తే, ఒక స్థాయి తరువాత మనిషి మనస్సు అల్లాహ్ యొక్క శక్తి చాలా గొప్పదని చెప్పక తప్పదు. మానవ శాస్త్రం (Anthroplogy), జీవశాస్త్రం (Biology), జన్యుశాస్త్రం (Genetics), వైద్య శాస్త్రం, పశువైద్య శాస్త్రం (Veterinary Science) మొదలైన వాటిలో రోజురోజుకు కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. సైన్స్ లోని ప్రతి పరిశోధన నిజానికి సృష్టిలో దాగి ఉన్న అల్లాహ్ శక్తి యొక్క సంకేతాలను చాటుతోంది.

ఖురాన్‌లోని సూరా రూమ్, ఆయత్ 21 లో మనుషులలో రంగుల వైవిధ్యంతో పాటు, భాషల వైవిధ్యం గురించి కూడా దృష్టిని మళ్లించటం జరిగింది. మనిషికి ఇన్ని భాషలు, మాండలికాలను (Dialects) ఎవరు నేర్పించారు? ఈ రోజు కూడా భాషా శాస్త్రజ్ఞులు (Linguists) చాలా పురాతన భాషల వ్రాతలను అర్థం చేసుకోవడానికి మరియు వాటిని వివరించడానికి ఇంకా అశక్తులుగా ఉన్నారు. ఈ శాస్త్రాలు కాకుండా మానవ ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి సంబంధించిన శాస్త్రాలైన మనస్తత్వ శాస్త్రం (Psychology), సామాజిక శాస్త్రం (Sociology), రాజకీయ శాస్త్రం, అర్థ శాస్త్రం మొదలైనవి కూడా ఉన్నాయి.

ఈ జ్ఞాన శాఖలన్నింటినీ ప్రస్తావించిన తరువాత, ఖురాన్ ఇలా చెబుతోంది: "అల్లాహ్ దాసులలో జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు." దీని అర్థం, మనిషి జ్ఞానం యొక్క ఈ శాఖలలో ఎంత లోతుగా అధ్యయనం చేస్తాడో, ఎంత ఎక్కువ నైపుణ్యం, పరిపూర్ణత వైపు వెళ్తాడో, అంతగా అతనికి అల్లాహ్ గురించి తెలుస్తుంది, అంతగా అతను ఆయన శక్తి, జ్ఞానం, గొప్పతనాన్ని నమ్ముతాడు. ఈ జ్ఞానాలను పొందిన తర్వాత కూడా ఎవరైనా అల్లాహ్‌ను తెలుసుకోలేకపోతే, దాని అర్థం అతను ఇంకా మిడిమిడి జ్ఞానాన్ని మాత్రమే కలిగి ఉన్నాడు, అతను వాటి గురించి లోతుగా ఆలోచించలేదు.

అదే విధంగా, ఖురాన్ ఇతర ఆయత్‌లలో (ఉదాహరణకు, అనామ్: 96, అల్-ఆరాఫ్: 54, యూనుస్: 5, అర్-రాద్: 2, అన్-నహ్ల్: 12, అల్-అంబియా: 33, అల్-హజ్: 18, అల్-అన్‌కబూత్: 61, లుఖ్మాన్: 29, ఫాతిర్: 13, యాసీన్: 40 మొదలైనవి) ఖుర్‌ఆన్ మనిషి దృష్టిని సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు మరియు గ్రహాల వైపు కూడా మళ్లిస్తుంది. వాటి నిర్మాణం, వాటి కదలికలు, వాటి కక్ష్యలు, కక్ష్యల్లో వాటి వేగం, వాటి మధ్య ఉన్న సమతుల్యత గురించి కూడా ఆలోచించమని ప్రేరేపిస్తుంది. ఈ మొత్తం విశ్వం అల్లాహ్ అత్యుత్తమ జ్ఞానానికి, పరిపూర్ణ శక్తికి అద్దం పడుతుంది. ఈ విశ్వంలోని ప్రతి వస్తువు ఈ విశ్వానికి ఒక సృష్టికర్త ఉన్నాడని చెబుతుంది, కానీ వాటి మాటలను వినడానికి, అర్థం చేసుకోవడానికి పరిపూర్ణ జ్ఞానం (Perfect Knowledge), సరైన ఆలోచన (Judicious Thought) అవసరం. అసంపూర్ణమైన జ్ఞానంతో ఈ జ్ఞాన స్థాయిని పొందలేము!

మేము త్వరలోనే వారికి మా సూచనలను వారి చుట్టూ ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము, వారిలోనూ చూపిస్తాము. చివరకు ఈ ఖురాన్ నిస్సందేహంగా సత్యమైనదని వారికి విశదమైపోతుంది. (ఖుర్‌ఆన్ 41: 53)

ఈ విశ్వంలో ప్రకృతి సంకేతాలు ఎవరికి అర్థమవుతాయి? ఖచ్చితంగా ఒక విశ్వ శాస్త్రవేత్త (Cosmologist) లేదా ఒక ఖగోళ భౌతిక శాస్త్రవేత్త (Astrophysicist)కే అర్థమవుతాయి. ఈ రోజు గెలాక్సీలు (Galaxies), బ్లాక్ హోల్స్ (Black Holes)ను చూసి ఎవరు ఆశ్చర్యపోతున్నారు? ఖచ్చితంగా ఖగోళ శాస్త్రజ్ఞులు (Astronomers)! తన ఉనికిలో అల్లాహ్ యొక్క సంకేతాలు ఎవరికి బాగా అర్థమవుతాయి? ఖచ్చితంగా శరీర నిర్మాణ శాస్త్రం (Anatomy), శరీర ధర్మశాస్త్రం (Physiology) లేదా మనస్తత్వ శాస్త్రం (Psychology)లో నిపుణుడైన వ్యక్తికి. షరతు ఏమిటంటే అతను నిజాయితీగా వాటి గురించి ఆలోచించాలి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి, జ్ఞానం యొక్క అన్ని శాఖలలో ఇస్లామీకరణ (Islamization) అవసరం. ప్రకృతి వ్యవస్థ, దాని సృష్టి గురించి సరైన పద్ధతిలో ఆలోచించే వ్యక్తి నాస్తికుడిగా ఉండడు.

ఖురాన్, మనిషిని సృష్టికర్తను గురించి తెలుసుకునేలా చేసే జ్ఞానం వైపు దృష్టి మళ్లించి, వాటిపై పరిశోధన చేయమని పిలుపునిస్తుంది. దీని నుండి మనకు అర్థమయ్యేది ఏమిటంటే, ఇక్కడ 'ఉలమా' అంటే సంప్రదాయ లేదా సాంకేతిక 'ఉలమా' మాత్రమే కాదు, సైన్స్ శాఖకు చెందినవారు కూడా అల్లాహ్ గురించి నిజమైన జ్ఞానం ఉన్నవారు అని అర్థం. ఎవరికి అల్లాహ్ గురించి ఎంత జ్ఞానం ఉంటే, వారు అంతగా ఆయనకు భయపడతారు. నిజమైన భక్తి ఆనందం కూడా అలాంటి వారికే లభిస్తుంది. దీనికి విరుద్ధంగా, అల్లాహ్ ను ఆరాధించనివారు, ఆయనకు భాగస్వామ్యం కల్పించేవారు, ఆయన ఆదేశాలను ఉల్లంఘించేవారు, ప్రజలపై అణచివేతకు పాల్పడేవారు నిజానికి అల్లాహ్ గురించి సరైన జ్ఞానం కలిగి ఉండరు.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



# నీటి సంక్షోభం పరిష్కారానికి ప్రవక్త (స) బోధనలు

- హసన్

ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత భయానక సంక్షోభం నీటి కొరత. భవిష్యత్తులో యుద్ధాలు సరిహద్దుల కోసం కాదు, నీటి వనరుల కోసం జరుగుతాయి అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితిని మనమే సృష్టించుకున్నాం. నీరు లాంటి సహజ వనరును వస్తువుగా మార్చి మార్కెట్‌లో అమ్మే స్థాయికి మానవుడు దిగజారిపోయాడు.

ఇస్లాం ఇచ్చిన దృక్కోణాన్ని గమనిస్తే ఈ నిర్లక్ష్యం మరింత స్పష్టమవుతుంది. ప్రవక్త ముహమ్మద్(స) కాలంలో మదీనా ఎడారి నగరం. అక్కడి బావులు, నీటి వనరులు సమాజానికి ఉచితంగా అందుబాటులో ఉండేలా ఆయన(స) చర్యలు చేపట్టారు. "దప్పిక తీర్చడం ఉత్తమ దానం" అని ఆయన బోధించారు. సహజ వనరులు ఎవరికీ చెందవని, ఇవి మానవాళి మొత్తం భాగస్వా మ్యం అని ఆయన స్పష్టం చేశారు. కాని నేడు? ఈ సూత్రాలను పూర్తిగా తుంగలో తొక్కుతున్నాం.

ప్రైవేటీకరణ పేరుతో బావులు, వాగులు, నదులు మల్టీ నేషనల్ కంపెనీల చేతుల్లోకి వెళ్తున్నాయి. సహజ వనరులను కార్పొరేట్ దోపిడీకి అప్పగించిన ప్రభుత్వాలే ఈ నేరానికి భాగస్వాములు. నీటిని బాటిల్‌లో నింపి విక్రయించే వ్యాపారం నేడు "సహజ వనరుల దోపిడీ"కి ప్రతీకగా మారింది. గ్రామాల్లో, పట్టణాల్లో సాధారణ ప్రజలు ఒక గ్లాసు తాగునీటి కోసం పోరాడుతుంటే, లాభాల కోసం బాటిల్ కంపెనీలు బిలియన్లు ఆర్జిస్తున్నాయి.

నీటి వృధా మరొక విపత్తు. వుజూ వంటి ఆధ్యాత్మిక ఆచారాల్లో కూడా నీటిని జాగ్రత్తగా వినియోగించాలని ప్రవక్త హెచ్చరించారు. కాని నేటి సమాజం? స్నానం, విందు, పరిశ్రమల వ్యర్థాల రూపంలో నదులు, సరస్సులు నాశనం చేస్తోంది. శుద్ధి చేయలేని రసాయనిక వ్యర్థాలతో నదులను విషపూరితం చేస్తోంది. ఇది కేవలం పర్యావరణ హననం కాదు తరాల భవిష్యత్తును కాలరాయడమే.

**ఈ పరిస్థితిలో ఒక ప్రశ్న తలెత్తుతుంది :**

- ❖ నీరు పంచుకోవాలని చెప్పిన ప్రవక్త బోధనలను ఎందుకు మరిచాం?
- ❖ సహజ వనరుల దోపిడీకి పాలకులు ఎందుకు తోడ్పడుతున్నారు?
- ❖ పేదలకు ఉచితంగా అందాల్సిన నీరు బాటిల్ నీటిగా ఎందుకు అమ్మబడుతోంది?

**సమాధానం ఒకటే** : లోభత్వం మానవుడి స్వార్థం సహజ వనరులను కూడా మార్కెట్ వస్తువులుగా మార్చేసింది. ఇది కేవలం ఆర్థిక దోపిడీ కాదు, నైతిక పతనం కూడా.

నీటి పంపిణీని సమానంగా చేయడం, వృధాను అరికట్టడం, కాలుష్యాన్ని నియంత్రించడం, ముఖ్యంగా నీటిని లాభం కోసం అమ్మకూడదనే నైతికతను చట్టబద్ధం చేయడం అత్యవసరం.

ప్రవక్త ముహమ్మద్ (స.అ.వ.) బోధనలు ఒక హెచ్చరిక; నీటిని నిల్వ చేసి సొమ్ము చేసుకోవద్దు, పంచి పుణ్యం పొందండి. కానీ మనం విరుద్ధంగా నడుస్తున్నాం. అదే కొనసాగితే రేపు రాబోయే యుద్ధాలు నీటి బిందువు కోసం జరగడం తప్పదనే చేదు నిజాన్ని ఎదుర్కోవాల్సిందే.




## వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు

వక్ఫ్ (సవరణ) చట్టం 2025పై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై స్టే విధించింది. పూర్తిగా చట్టంపై స్టే విధించేందుకు మాత్రం నిరాకరించింది. కనీసం ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న నిబంధనను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు రూపొందించే వరకు  ఇది అమలు కాదని స్పష్టం చేసింది. చట్టంలోని ఇలాంటి పలు కీలక నిబంధనలను నిలిపివేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహలతో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని సెక్షన్లకు కొంతమేరకు రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. "మొత్తం చట్టంపైనే స్టే విధించాల్సిన అవసరం లేదని గుర్తించాం. అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే అలాంటి పరిస్థితి వస్తుంది. వక్ఫ్ చట్టంపైనే స్టే విధించాలన్న అభ్యర్థనలను తిరస్కరిస్తున్నాం" అని ధర్మాసనం తేల్చి చెప్పింది. అయితే, వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజారిటీలో ఉండాలని, కేంద్ర వక్ఫ్ బోర్డు లేదా కౌన్సిల్‌లో ఉండే 20 మంది సభ్యుల్లో ముస్లిమేతరుల సంఖ్య నాలుగుకు మించరాదని చెప్పింది. ఇక రాష్ట్రాల బోర్డుల్లో మొత్తం 11 మంది సభ్యుల్లో ముగ్గురికి మించి  ముస్లిమేతరులు ఉండరాదని తేల్చిచెప్పింది. వక్ఫ్ బోర్డుకు ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈవో) నియామకం, ఇతర సర్వీసు నిబంధనలు నిర్ణయించడానికి సంబంధించిన సెక్షన్ 23పై మాత్రం స్టే విధించలేదు. కానీ, బోర్డు సీఈవోగా ముస్లిం వ్యక్తే ఉండడం మంచిదని తెలిపింది. అలాగే వివాదాస్పద ఆస్తిపై సంబంధిత అధికారి (కలెక్టర్) నివేదిక ఇచ్చేదాకా దాన్ని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనపైనా స్టే విధించింది. ఆస్తి ప్రభుత్వానిదిగా సంబంధిత అధికారి పేర్కొంటే, దానికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో సవరణలు చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్న నిబంధనను కూడా నిలిపివేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## దేశంలో ప్రతి ఐదుగురు నేతల్లో ఒకరు రాజకీయ వారసులే

భారత ప్రజాస్వామ్యంలో కుటుంబ రాజకీయాలు బలంగా పాతుకుపోయాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలలో ప్రతి ఐదుగురిలో ఒకరు (21%) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినవారేనని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈడబ్ల్యూ) సమగ్ర విశ్లేషణలో తేటతెల్లమైంది. దేశవ్యాప్తంగా మొత్తం 5,204 మంది ప్రజాప్రతినిధులపై విశ్లేషణ చేయగా, వీరిలో 1,107 మంది వారసత్వ నేపథ్యం ఉన్నవారే కావడం గమనార్హం. లోక్ సభలో ఈ ప్రభావం అత్యధికంగా 31 శాతంగా ఉంది. ముఖ్యంగా, మహిళా ప్రజాప్రతినిధుల్లో ఈ ధోరణి రెట్టింపు కన్నా ఎక్కువగా ఉంది. దాదాపు సగం మంది (47%) వారసత్వంగానే రాజకీయాల్లోకి అడుగుపెట్టారని నివేదిక వెల్లడించింది. వారసత్వ రాజకీయాల వాటాలో ఆంధ్రప్రదేశ్ (34%) దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

## వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు అసంపూర్ణం



వక్ఫ్ (సవరణ) చట్టం-2025పై సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పును అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు "అసంపూర్ణం, అసంతృప్తికరమైనది" అని పేర్కొంది. దీనిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ మేరకు AIMPLB ప్రతినిధి డాక్టర్ ఎస్. ఖాసిమ్ రసూల్ ఇలియాస్ మీడియాతో మాట్లాడారు. "కోర్టు పాక్షిక ఉపశమనం ఇచ్చినప్పటికీ, అది విస్తృత రాజ్యాంగ సమస్య లను పరిష్కరించలేదు. ముస్లిం సమాజం, పర్సనల్ లా బోర్డు, న్యాయం కోరుకునే పౌరులు రాజ్యాంగానికి విరుద్ధమైన అన్ని నిబంధనలపై పూర్తి స్టే విధించాలని ఆశించారు" అని డాక్టర్ ఇలియాస్ అన్నారు. వక్ఫ్ వ్యవహారాలను నిర్వహించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న పక్షపాత వైఖరిని ఆయన విమర్శించారు, చట్టంలోని అనేక "ఏకపక్ష" నిబంధనలు అమలులో ఉన్నాయని, పూర్తి స్టే లేనప్పుడు దుర్వినియోగం చేయవచ్చని పేర్కొన్నారు. అయితే, తాత్కాలిక ఉత్తర్వు చట్టంలోని అనేక వివాదాస్పద అంశాలపై ఉపశమనం కలిగించింది.

సర్వత్రా

## అరబ్-ఇస్లామిక్ నాటో.. సైనిక కూటమి ఏర్పాటుకు ఇస్లామిక్ దేశాల యోచన

ఖతర్‌లో హమాస్ నాయకులపై ఇస్రాయీల్ జరిపిన దాడులకు ఐక్యంగా స్పందించిన అరబ్, ఇస్లామిక్ దేశాలకు చెందిన పలువురు నాయకులు దోహాలో సమావేశమయ్యారు. ఇస్రాయీల్ దాడులను తిప్పికొట్టడంపై తీసుకోవలసిన చర్యల విషయంలో నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ అరబ్ సైనిక కూటమి ఏర్పాటుపై మాత్రం వారు ఏకాభిప్రాయానికి వచ్చారు. అరబ్ ప్రపంచంలో అతి పెద్ద సైనిక పంపత్తి గల ఈజిప్టు ఈ అరబ్ సైనిక కూటమికి అరబ్ నాటో అని నామకరణం చేయగా, దోహాలో జరిగిన అత్యవసర సమావేశానికి పాకిస్థాన్, తుర్కియే కూడా హాజరయ్యాయి. అణ్వస్త్రాలు గల ఏకైక ముస్లిం దేశమైన పాకిస్థాన్ ఈ అత్యవసర సమావేశంలో పాల్గొనడంతోపాటు ఇస్రాయీలీ కుట్రలను కనిపెట్టేందుకు ఓ ఉమ్మడి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది. ఇస్రాయీల్‌ని ఆర్థికంగా దెబ్బతీయాలని తుర్కియే అధ్యక్షుడు తయ్యిబ్ ఎర్డోగన్ ఈ సమావేశంలో సూచించారు. నాటో తరహాలో అరబ్, ఇస్లామిక్ దేశాలు ఉమ్మడి భద్రతా వ్యవస్థను నిర్మించుకోవాలని ఇరాక్ ప్రధాని మొహమ్మద్ సుడానీ కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా 34 దేశాల ఇస్లామిక్ కూటమి ఏర్పాటుకు సౌదీ అరేబియా గతంలోనే ప్రతిపాదించింది.

## పాలస్తీనాకు అనుకూలంగా భారత్ ఓటు

గాజాపై భారత్ తన వైఖరిని మార్చుకుంది. పాలస్తీనాకు మద్దతుగా ఐక్యరాజ్యసమితిలో ఓటు వేసింది. కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస గతంలో ఆమోదించిన తీర్మానాలపై ఓటింగ్ జరిగినప్పుడు భారత్ నాలుగు సందర్భాలలో గైర్హాజరు అయింది. దీనిపై పలు దేశాలు భారత్‌పై విమర్శలు కురిపించాయి. అయితే తాజాగా పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనాలన్న 'న్యూయార్క్ డిక్లరేషన్'కు భారత్ మద్దతు ప్రకటించింది. ఒకప్పటి పాలస్తీనా భూభాగంలో రెండు దేశాలను (యూదులకు ఇస్రాయీల్, పాలస్తీనా ప్రజలకు పాలస్తీనా) ఏర్పాటు చేయడం ద్వారా ఇస్రాయీల్-పాలస్తీనా సమస్యకు పరిష్కారం సాధించాలన్న ప్రతిపాదనను సమర్థించింది. ఫ్రాన్స్ ప్రతిపాదించిన తీర్మానానికి భారత్ సహా 142 దేశాలు అనుకూలంగా ఓటేయగా 10 దేశాలు వ్యతిరేకించాయి. 12 దేశాలు గైర్హాజరు అయ్యాయి. 'పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం కోసం, అలాగే రెండు దేశాల విధానం అమలు కోసం న్యూయార్క్ డిక్లరేషన్‌ను ఆమోదించడం' అనే పేరుతో ఫ్రాన్స్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దీనిని గల్ఫ్ అరబ్ దేశాలన్నీ సమర్థించాయి. ఇస్రాయీల్, అమెరికా, అర్జెంటీనా, హంగరీ, మైక్రోనేసియా, నౌరూ, పాలవ్, పపువా న్యూ గునియా, పరాగ్వే, టాంగా వ్యతిరేకించాయి. ఈ డిక్లరేషన్‌ను జూలైలో ఐరాస కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పంపిణీ చేశారు. ఈ సమావేశానికి ఫ్రాన్స్, సౌదీ అరేబియాలు సహా అధ్యక్షత వహించాయి. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న ఘర్షణను నివారించడానికి చర్చలు తిరిగి ప్రారంభించాలన్న ఉద్దేశంతో ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు.



## పిల్లల్లో 10 శాతం మంది ఊబకాయులే!

పిల్లల్లో ఊబకాయ సమస్య ప్రపంచానికి పెద్ద ఆరోగ్య సంక్షోభంలా పరిణమించబోతోందని యునిసెఫ్ తాజా నివేదిక హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా బాలల్లో 10 శాతం మంది ఊబకాయంతో ఉన్నట్లు నివేదిక తెలిపింది. ప్రతి పది మంది పిల్లల్లో ఒకరికి ఊబకాయం ఉంటోందని పేర్కొంది. సాంప్రదాయ ఆహారాలు, ఇతర పోషక పదార్థాలకు బదులుగా పిల్లలు అధిక కేలరీలున్న, ప్రాసెస్డ్ ఫుడ్‌కు అలవాటు పడటమే ఇందుకు కారణం అని చెబుతూ, ఈ అలవాట్లు పిల్లలకు దీర్ఘకాలిక అనారోగ్యాలను తెచ్చిపెట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. 'తగినంత ఆహారం లేక గతంలో పిల్లలు తరచూ బరువు తక్కువగా ఉండేవారు. అది వారి శారీరక పెరుగుదలను కుంగదీయడమే కాదు, అనేక ఆరోగ్య సమస్యలకూ దారితీసింది. అయితే, తాజా పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. జంక్ ఫుడ్‌ను తినకుండా ఉండలేక పిల్లలు బరువెక్కుతున్నారు' అని యునిసెఫ్ తన నివేదికలో వ్యాఖ్యానించింది.

# రోగుల పరామర్శ

## - ముహమ్మద్ వహీదుద్దీన్

**అంతిమ** దివ్య ఖుర్‌ఆన్ రోగుల పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ, సేవ, ఆర్థిక సహాయం గురించి అనేక సూచనలు చేసింది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించమని ప్రత్యేకంగా తాకీదు చేశారు.

హజ్రత్ అబూ హురైరా(రజి) కథనం: ప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు. అల్లాహ్ ప్రతిఫలదినాన ఈ విధంగా ప్రశ్నిస్తాడు: ఓ ఆదం కుమారుడా! నేను అనారోగ్యంగా ఉన్నప్పుడు నీవు నన్నెందుకు పరామర్శించలేదు. అతనిలా విన్నవించుకుంటాడు. ఓ నా ప్రభువా! నీవు సర్వలోకాలకు ప్రభువు. నిన్ను నేనెలా పరామర్శించగలను? అల్లాహ్ ఇలా జవాబిస్తాడు: నా దాసుడొకడు అనారోగ్యంగా వున్నాడని నీకు తెలియదా! తెలిసి కూడా నీవతన్ని పరామర్శించలేదు. నీవతన్ని పరామర్శించి ఉంటే అతని వద్ద నన్ను (నా కరుణా కృపలను) కనుగొనే వాడివని నీకు తెలియదా?

### రోగిని పరామర్శించటం అత్యంత పుణ్యకార్యం

హజ్రత్ అలీ(రజి) ఇలా తెలిపారు : ప్రవక్త ముహమ్మద్(స) ఇలా పలుకుతుండగా నేను విన్నాను. ఒక ముస్లిం తన ముస్లిం సోదరుని పరామర్శకై ఎంతసేపు నడుస్తాడో అంత సేపు అతను స్వర్గమార్గంలో ఉంటాడు. అతను కూర్చునే వరకు అతని పరిస్థితి అలాగే ఉంటుంది. అతను కూర్చున్న తర్వాత అల్లాహ్ కరుణాకృపలు అతనిపై కురుస్తూ ఉంటాయి. అతను ఉదయాన పరామర్శిస్తే సాయంత్రం వరకు అతనికై 70వేల దైవదూతలు ప్రార్థిస్తూ ఉంటారు. సాయంత్రం పరామర్శిస్తే ఉదయం వరకు 70వేల దైవదూతలు అతనికై ప్రార్థిస్తూ ఉంటారు. (తిర్మిజీ)

### రోగిని పరామర్శించే సమయాన ఈ దుఆ ఏడుసార్లు పఠించాలి

హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర) ఇలా తెలిపారు : ప్రవక్త ముహమ్మద్(స) ఇలా బోధించారు : ఒక ముస్లిం తన సోదరుని పరామర్శించి ఈ విధంగా "అస్అలుల్ లాహల్ అజీమా రబ్బుల్ అర్షిల్ అజీమి అన్ యష్ఫీక" అని ఏడుసార్లు పలికితే, ఆ రోగి మరణ సమీపంలో లేకుంటే అతనికి తప్పక స్వస్థత కలుగుతుంది. (అబూ దావూద్)

హజ్రత్ అనస్(ర) ఇలా తెలిపారు : ఒక యూదు పిల్లవాడు దైవప్రవక్త(స) వద్ద సేవ చేసేవాడు. అతను అనారోగ్యానికి గురైనప్పుడు ప్రవక్తగారు అతన్ని పరామర్శించడానికి వెళ్ళి, ఇస్లాం స్వీకరించమని కోరగా అతను ఇస్లాం స్వీకరించాడు. (బుఖారీ)

### అనారోగ్యంలో కూడా కృతఘ్నతతో కూడిన మాటలు పలుకరాదు

హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా తెలిపారు : ప్రవక్త ముహమ్మద్(స) ఒక రోగిని పరామర్శించటానికి వెళ్ళి ఇలా పలికారు 'విచారపడవద్దు. అల్లాహ్ తలచుకుంటే ఈ రోగం నిన్ను పాపాల నుండి శుభ్రపరుస్తుంది. అప్పుడా రోగి ఇలా అన్నాడు : లేదు లేదు మండుతున్న ఈ జ్వరం ఈ ముసలివాడిని సమాధిలో చేర్చేవరకు ఊరుకోదు. దానికి ప్రవక్త(స) గారు ఇలా పలికారు "అలా అయితే సరే." (బుఖారీ)

### వ్యాధిని దూషించరాదు

హజ్రత్ జాబిర్(ర) ఇలా పలికారు : దైవప్రవక్త ముహమ్మద్(స) ఉమ్మె సాయిబ్ అనే ఒక స్త్రీని పరామర్శించటానికి వెళ్ళారు. ఆమె వణుకుతుంటే నీకేమైంది, వణుకుతున్నావేంటి? అని ప్రశ్నించారు. దానికామె ఇలా చెప్పింది : జ్వరం వచ్చింది. అల్లాహ్ ఈ జ్వరాన్ని నాశనం చేయుగాక! అప్పుడు దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా ఉపదేశించారు : జ్వరాన్ని దూషించవద్దు. గాడిపొయ్యి ఇనుములోని మలినాలను దూరం చేసినట్లే జ్వరంకూడా మానవుల పాపాలను దూరం చేస్తుంది. (ముస్లిం)

జ్వరాన్ని చన్నీటి వైద్యంతో నివారించమని ప్రవక్త(స) గారు తెలిపారు: జ్వరం నరకాగ్నిలోని అగ్ని వంటిది. దాన్ని చల్లటి నీటి ద్వారా నివారించండి. (ఇబ్నెమాజా)

### రోగ బాధ సమయంలో రోగి ప్రార్థన అంగీకరించబడుతుంది

హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర) దైవప్రవక్త(స) ద్వారా ఉల్లేఖించారు. ఐదుగురి ప్రార్థన స్వీకరించబడుతుంది.

1) దౌర్జన్య పీడితుడి ప్రార్థన తనపై జరిగిన దౌర్జన్యానికి బదులు తీసుకునేవరకు (సహాయం పొందేవరకు)

2) హజ్ యాత్ర చేసేవారు తిరిగి తన ఇంటికి చేరుకునేవరకు.

3) ధర్మయుద్ధ విరమణ వరకు ముజాహిద్ ప్రార్థన.

4) రోగి ప్రార్థన అతను కోలుకునే వరకు.

5) ఒక ముస్లిం సోదరుడు తన మరొక ముస్లిం సోదరుని కోసం పరోక్షంగా చేసే ప్రార్థన. (తిర్మిజీ)

ప్రవక్త ఇబ్రాహీమ్ ఇలా అన్నారు : 'నేను వ్యాధికి గురైనప్పుడు, ఆయనే నాకు స్వస్థతను చేకూరుస్తాడు. (అష్ షుఅరా 26: 80)

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**